# చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

నిజామాబాద్
సోమవారం
21.04.2025

సంపుటి : 15 సంచిక: 222
పేజీలు: 6 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్




## నన్ను చంపేందుకు కుట్రలు: కేంద్రమంత్రి

తన హత్యకు ఖలిస్థానీలు కుట్రలు చేస్తున్నారని కేంద్రమంత్రి రవనీత్ సింగ్ బిట్టూ సంచలన ఆరోపణలు చేశారు. రాడికల్ ప్రచారకుడు, ఎంపీ అమృత్‌పాల్ సింగ్ నడిపిస్తున్న 'వారిస్ పంజాబ్ దే' సంస్థతో సంబంధమున్న ఖలిస్థానీ మద్దతుదారులే తన హత్యకు ప్లాన్ చేశారని చెప్పకొచ్చారు. దీంతో, ఆయన వ్యాఖ్యలు పెను దుమారం రేపుతున్నాయి. తాజాగా, రైల్వేశాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టు మాట్లాడుతూ.. పంజాబ్‌లోని రాజకీయ నాయకులకు ఖలిస్థానీ మద్దతుదారుల నుంచి ప్రమాదం పొంచి ఉంది. పలువురు నేతల హత్యకు వారు ప్లాన్ చేస్తున్నారు. ఖలిస్తానీల ప్లాన్ గురించి సోషల్ మీడియాలో లీకైన కొన్ని స్క్రీన్ షాట్ల ద్వారా ఈ విషయం నాకు తెలిసింది. ఎంపీ అమృత్‌పాల్ సింగ్ నడిపిస్తున్న 'వారిస్ పంజాబ్ దే' సంస్థతో సంబంధమున్న ఖలిస్థానీ మద్దతుదారులే ఇందులో ఉన్నారు. నాతో పాటుగా మరికొంతమంది రాజకీయ నాయకుల ప్రాణాలకు కూడా ఖలిస్థానీయుల నుంచి ముప్పు పొంచి ఉంది' అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇదే సమయంలో.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై కూడా వారిస్ పంజాబ్ దే నాయకులు కక్ష పెంచుకున్నారని ఆరోపించారు. జాతీయ భద్రతా చట్టం కింద అమృత్‌పాల్ నిర్బంధం మరో ఏడాది పొడిగించడమే ఇందుకు కారణమని చెప్పకొచ్చారు. ఈ విషయాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణిస్తోందని వెల్లడించారు. అందుకే ఈ గ్రూపుతో సంబంధం ఉన్న ఖలిస్తానీ శక్తులను పంజాబ్ ప్రభుత్వం వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



## ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలను ఆదుకుంటాం

- వారికి ఉపాధి కల్పిస్తాం: మంత్రి సీతక్క

**చట్టం, ఇంద్రవెల్లి:** ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం ఇంద్రవెల్లి స్థూపం వద్ద నిర్వహించిన సంస్మరణ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అమరవీరులకు నివాళి అర్పించి, సంప్రదాయ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడారు. 44 ఏళ్ల క్రితం జరిగిన ఘటనలో ఎందరో ఆదివాసీ బిడ్డలు అమరులవడం దురదృష్టకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగానే అమరవీరుల సంస్మరణ దినోత్సవం రోజున అమరుల కుటుంబాలకు ట్రైకార్ ఆధ్వర్యంలో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను అందించామని తెలిపారు. ఇంద్రవెల్లిలో రూ.కోటితో స్మృతివనం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఇంద్రవెల్లి పోరాటంలో 15 మంది అమరులయ్యారని ఆనాటి ప్రభుత్వాలు నిర్ధారించాయని, వాస్తవంగా ఆ సంఖ్య మరింత ఎక్కువ ఉంటుందని పేర్కొన్నారు. వారి వివరాలను ఐటీడీఏ పీవో ఆధ్వర్యంలో గుర్తించి, ఆ కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.



## పేద ముస్లింలకు న్యాయం

- వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా బడా చోర్‌ల సభ
- ఆ సభకు అంతా సమకూర్చింది రేవంత్
- కేంద్ర మంత్రి బండి సంజయ్

**చట్టం, హైదరాబాద్:** పేద ముస్లింలకు న్యాయం జరగాలనే ఉద్దేశంతోనే కేంద్రం వక్ఫ్ సవరణ చట్టాన్ని తీసుకువచ్చిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదివారం పెద్దపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. పేద ముస్లింలను దోచుకున్న ఎంఐఎం పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ మద్దతు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బడా చోర్‌లందరూ కలిసి మీటింగ్ పెట్టారని విమర్శించారు. టైటిల్ డీడ్ లేని భూములను వక్ఫ్ పేరుతో ఆక్రమించుకున్న చరిత్ర ఎంఐఎం పార్టీదని మండిపడ్డారు. 8 లక్షల ఎకరాల భూమి, రూ.10 లక్షల కోట్ల సంపద ఉన్నా.. ఒక్క పేద వాడికి కూడా వక్ఫ్ సంస్థ ఉపయోగపడలేదని విమర్శించారు. తాము సభ పెడితే పరిస్థితి మరోలా ఉంటుందని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన సభకు కర్త, కర్మ, క్రియ రేవంత్‌రెడ్డి అని.. మీటింగ్‌కు నిధులు సమకూర్చింది కూడా ఆయనేనని ఆరోపించారు. మంచి ఉద్దేశంతో వక్ఫ్ సవరణ చట్టాన్ని తెస్తే మత కోణంలో ప్రతిపక్షాలు విద్వేషాలను రెచ్చగొడుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.



# హైదరాబాద్‌లో ఎకో టౌన్

- జపాన్‌లోని కిటాక్యుష మాదిరిగా భాగ్యనగరం
- భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకరమైన వాతావరణం
- పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నాం: రేవంత్
- కిటాక్యుష నగరాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి
- జపాన్ సంస్థలతో తెలంగాణ సర్కారు ఒప్పందం
- హైదరాబాద్‌లో జపనీస్ పాఠశాల ఏర్పాటు యోచన

**చట్టం, హైదరాబాద్:**

హైదరాబాద్‌లో ఎకో టౌన్ అభివృద్ధి చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించగలమనే విశ్వాసాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వ్యక్తం చేశారు. సుస్థిరత ఇకపై ఐచ్ఛికం కాదని, అవసరమని అన్నారు. ఉపాధి కల్పన, అభివృద్ధి, సంపద సృష్టితోపాటు పర్యావరణ పరిరక్షణకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జపాన్ పర్యటనలో భాగంగా సీఎం నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం ఆదివారం పర్యావరణహిత కిటాక్యుష నగరాన్ని సందర్శించింది. హైదరాబాద్‌లో ఎకో టౌన్ ఏర్పాటుకు జపాన్‌కు చెందిన ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ రంగాల్లో భాగస్వామ్యం పంచుకోనుంది. కాగా, కిటాక్యుష నగర మేయర్ కజుహిసా టేకుచితో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతోపాటు అధికారులు భేటీ అయ్యారు. పర్యావరణ అనుకూల సాంకేతికతలు, పరిశుభ్రమైన నగర నమూనాలు, నదుల పునరుజ్జీవ విధానాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఈఎక్స్, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, పీ9 ఎల్ఎల్పీ, నిప్పాన్ స్టీల్ ఇంజనీరింగ్, న్యూ కెమికల్ ట్రేడింగ్, అమితా హోల్డింగ్స్ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ మేరకు సీఎం సమక్షంలో లెటర్స్ ఆఫ్ ఇంటెంట్‌పై తెలంగాణ ప్రభుత్వ అధికారులు, కంపెనీల ప్రతినిధులు సంతకాలు చేశారు. కిటాక్యుష మాదిరిగా హైదరాబాద్‌ను శుభ్రమైన, సుస్థిర నగరంగా తీర్చిదిద్దే దిశగా ఈ ఒప్పందాలు జరిగాయి. ఒకప్పుడు పారిశ్రామిక కాలుష్యంతో ఇబ్బందులు పడ్డ కిటాక్యుష నగరం ఇప్పుడు ప్రపంచంలోని పరిశుభ్రమైన నగరాల్లో ఒకటిగా ఎలా మారిందో మేయర్ టేకుచి వివరించారు. తమ అనుభవాలు, పర్యావరణ పరిరక్షణకు చేపట్టిన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణతో పంచుకునేందుకు ఆసక్తి ప్రదర్శించారు.

### పెట్టుబడులకు అనువైన వాతావరణం..

**పరిశ్రమల అభివృద్ధికి తెలంగాణ అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా వృద్ధి చెందిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తితోపాటు తమ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన జపాన్ కంపెనీల పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా హైదరాబాద్- కిటాక్యుష నగరాల మధ్య విమాన ప్రయాణ సౌకర్యం ఏర్పాటు చేయాలనే అంశం చర్చకు వచ్చింది. హైదరాబాద్‌లో జపనీస్ భాష పాఠశాల ఏర్పాటు చేసే ప్రతిపాదనను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. జపాన్‌లో యువశక్తి అవసరం ఎక్కువగా ఉందని, మన యువతకు జపనీస్ భాషపై నైపుణ్యం కల్పిస్తే.. అంతర్జాతీయంగా వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రతినిధి బృందం మురాసాకి పునరుజ్జీవ ప్రాజెక్టును సందర్శించింది. గతంలో కాలుష్య కాసారంగా ఉన్న ఈ నది.. పరిశుభ్రమైన నదీతీరంగా మారిన తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. అంతకుముందు సీఎం రేవంత్ బృందానికి కిటాక్యుషలో స్థానిక సంప్రదాయ రీతిలో స్వాగతం లభించింది.**

### ఇంద్రవెల్లి రెక్కలు విప్పుకొంది: రేవంత్

**జల్.. జంగిల్.. జమీన్ అంటూ హక్కుల కోసం పోరాడి, అసువులు బాసిన అడవి బిడ్డలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళి అర్పించారు. వారి పోరాటం సదా స్ఫూర్తిదాయకమన్నారు. ఇంద్రవెల్లి అమరుల సంస్మరణ దినం సందర్భంగా ఆయన ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "నాలుగు దశాబ్దాల నిర్బంధం బద్దలైంది. ఇంద్రవెల్లి స్వేచ్ఛగా రెక్కలు విప్పుకొంది. నాకు అండగా నిలిచి.. ఇంద్రవెల్లి కొండల్లో దండోరా మోగించిన ఆదివాసీలకు అన్నగా, ఆత్మీయులకు దన్నుగా తీసుకున్న నిర్ణయం స్వేచ్ఛ" అని సీఎం రేవంత్ పేర్కొన్నారు.**

## బీఆర్ఎస్‌ను లేకుండా చేయాలని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కంకణం

- ఆ రెండు పార్టీలు తెలంగాణకు శత్రువులే.. ప్రజలకు రక్షణ గులాబీ జెండానే
- వైఎస్ఆర్ తెచ్చిన ఆరోగ్య శ్రీ భేష్.. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసిన చంద్రబాబు వారిద్దరినీ అభినందించాల్సిందే: కేటీఆర్

**చట్టం, హైదరాబాద్:** "బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి బీఆర్ఎస్‌ను లేకుండా చేయాలని కంకణం కట్టుకున్నాయి. రెండు జాతీయ పార్టీలు తెలంగాణకు శత్రువులే. తెలంగాణ ప్రజలకు రక్షణ కవచం గులాబీ జెండా. ప్రజలకు ఏ కష్టం వచ్చిన అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీయే" అని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని అత్తాపూర్ డివిజన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వనం శ్రీరాంరెడ్డి తన అనుచరులతో కలిసి ఆదివారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దేశంలో ఎన్నో కొత్త పార్టీలు వచ్చాయి.. పోయాయి.. రాజకీయ చరిత్రలో నిలిచిపోయిన పార్టీలు తెలుగుదేశం, బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి వచ్చిన వారి ఉత్సాహం చూస్తుంటే తొందరలోనే పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ఎమ్మెల్యే అవుతాడనిపిస్తోందని చెప్పారు. 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రులుగా పనిచేసిన దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్య శ్రీ పథకం తీసుకువచ్చి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని, చంద్రబాబు ఐటీ రంగాన్ని అభివృద్ధి చేశారని



కొనియాడారు. వారిద్దరినీ అభినందించాల్సిందేనన్నారు. వాళ్లు తీసుకొచ్చిన పథకాలను తాము కొనసాగించామని, మంచి పనులను బీఆర్ఎస్ ఎప్పుడూ అడ్డుకోదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేస్తామంటూ.. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని అఘాతంలో పడేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల మాటలు పెద్దవి.. చేతలు చిన్నవి అన్నట్లు ఉన్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల ఇండ్లు, వ్యాపార సముదాయాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉంటే ముట్టుకోరని, హైడ్రా పేరుతో పేదల ఇండ్లను మాత్రం కూల్చుతున్నారని ఆరోపించారు. తెలంగాణకు బీజేపీ ఒక్క మంచి పని చేయలేదని దుయ్యబట్టారు. ఈ సందర్భంగా 'సమరశంఖ గర్జన గెరిల్లా ఉద్యమాల ఖిల్లా.. ఓరుగల్లు జిల్లా' అంటూ సాగే పాటను కేటీఆర్ విడుదల చేశారు.

## 'వక్ఫ్' సవరణను అమలు కానివ్వం

- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్
- నిజామాబాద్‌లో ముస్లింల భారీ ర్యాలీ

**చట్టం, నిజామాబాద్ :** ఎట్టి పరిస్థితుల్లోనూ వక్ఫ్ బోర్డు చట్ట సవరణను అమలు కానివ్వబోమని, చట్ట ప్రకారం కోర్టుల ద్వారా అడ్డుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బోధన్ రోడ్డులో వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. వక్ఫ్ ఆస్తులను తమ ఆధీనంలోకి తీసుకుని ముస్లిం మైనార్టీ సమాజాన్ని బలహీనపర్చేలా కేంద్రం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. వక్ఫ్ బోర్డు చట్ట సవరణను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు వక్ఫ్ బోర్డు చట్ట సవరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ తరపున సుప్రీంకోర్టులో సొంత ఖర్చులతో పిటిషన్ దాఖలు చేశానని తెలిపారు. ఈ సవరణ చట్టబద్ధతపై సుప్రీంకోర్టు ఇప్పటికే విచారణ మొదలు పెట్టి కేంద్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేస్తూ వివరణ కోరిందని షబ్బీర్ అలీ చెప్పారు. గతంలో ముస్లింలు మాత్రమే వక్ఫ్ కౌన్సిల్ బోర్డులో భాగమని, సవరణ తర్వాత హిందువులు కూడా భాగం కావచ్చునని, ఇది పార్లమెంటరీ చట్టం ప్రాథమిక హక్కులను ప్రత్యక్షంగా ఉల్లంఘించడమేనని ఆయన పేర్కొన్నారు. భారత అత్యుత్తమ న్యాయస్థానం సుప్రీంకోర్టుపై తమకు పూర్తి నమ్మకం ఉందని, తప్పక న్యాయం జరుగుతుందని అన్నారు.



## మావోయిస్టుల లొంగు 'బాట'

- పెరిగిన నిర్బంధంతో ఉక్కిరిబిక్కిరి.. కేడర్‌ను కాపాడుకోవడానికి లొంగుబాటు వ్యూహం
- సరెండర్ అవ్వాలని కేడర్‌కు సూచిస్తున్న అగ్రనేతలు.. భారీ ఎత్తున లొంగిపోతున్న కిందిస్థాయి కేడర్

**చట్టం, భద్రాద్రి కొత్తగూడెం:** వరుస ఎన్‌కౌంటర్లు, తీవ్ర నిర్బంధంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మావోయిస్టులు లొంగుబాటు వ్యూహాన్ని ఎంచుకున్నారా? ప్రస్తుత పరిస్థితుల్లో బతికి ఉండాలంటే ప్రభుత్వానికి లొంగిపోవటం ఒక్కటే మార్గమని భావిస్తున్నారా? తాజా పరిణామాలు గమనిస్తే ఇది నిజమే నని అంటున్నారు విశ్లేషకులు. నెల రోజులుగా మావోయిస్టు పార్టీ ఏరియా కమిటీ సభ్యులు, జనమిలీషియా, చేతన నాట్య మండలికి చెందిన వారు భారీ ఎత్తున లొంగిపోతున్నారు. ఓవైపు శాంతి చర్చల అంశంపై స్పష్టత రాకముందే లొంగుబాట్లకు మావోయిస్టులు ముందుకు రావడం చర్చనీయాంశమైంది.

**అష్టదిగ్బంధనం..**

మావోయిస్టులకు కేంద్రస్థానమైన బస్తర్ అరణ్యంపై ప్రభుత్వ దళాలు ఆపరేషన్ కగార్ పేరుతో విరుచుకుపడుతున్నాయి. వరుసగా చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్లతో ఇప్పటివరకు 400 మందికి పైగా తమ సభ్యులు మరణించినట్టు మావోయిస్టులే ప్రకటించారు. కేంద్ర కమిటీ సభ్యుడు చలపతితోపాటు కీలక నేతలైన రేణుక, ఊర్మిళ, మాచర్ల ఏసోబు వంటి అగ్రనేతలు మృతిచెందడం ఆ పార్టీకి భారీ నష్టాన్ని కలిగించింది. అడవుల్లో ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒకటి చొప్పున భద్రతా దళాలు బేస్ క్యాంప్ ఏర్పాటు చేయటంతో మావోయిస్టుల కదలికలు పరిమితమయ్యాయి.



**లొంగిపోవాలని నేతల పిలుపు..!**

నిర్బంధం పెరిగిపోవడంతో మావోయిస్టు ముఖ్య నాయకులు, సాయుధ దళాలు ఒకటిరెండు ప్రాంతాలకే పరిమితమయ్యాయి. భద్రత దృష్ట్యా కీలక నేతలు కిందిస్థాయి కేడర్‌ను కలిసే అవకాశం దక్కడం లేదు. దీంతో పార్టీ విస్తరణ, జనతన సర్కార్ నిర్వహణ కష్టంగా మారాయి. మరోవైపు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న నాయకులకు వైద్యసాయం అందించడం కత్తి మీద సాములా మారింది. దీంతో మావోయిస్టు పార్టీ పునరాలోచనలో పడినట్టు తెలుస్తోంది. అందులో భాగంగానే ఓవైపు శాంతి చర్చలకు పిలుపునివ్వడంతోపాటు కింది స్థాయి కేడర్‌ను ప్రభుత్వానికి లొంగిపోవాలని సూచించినట్టు తెలుస్తోంది. తిరిగి అనుకూల సమయం వచ్చినప్పుడు పార్టీని విస్తరించుకుందామని చెబుతున్నట్లు సమాచారం.

**ఛత్తీస్‌గఢ్ నుంచి బయటకు..**

లొంగుబాటుకు ప్రయత్నిస్తున్న నక్సల్స్‌లో చాలామంది బస్తర్ ఎన్‌కౌంటర్లలో చనిపోతుండడంతో అక్కడ లొంగుబాటు ప్రక్రియకు ఆదిలోనే బ్రేకులు పడ్డాయి.

– మిగతా 6వ పేజీలో..

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

## సంపాదకీయం

# జనం ప్రాణాలంటే విలువేది?

వెల్లువలా వచ్చిపడుతున్న ప్రయాణికులు, రివాజు తప్పకుండా ఆలస్యంగా వచ్చిపోయే రైళ్లు, ఉన్న గందర గోళాన్ని ఒకింత పెంచే అనౌన్స్‌మెంట్లు, ఏమూలకూ సరిపోని మౌలిక సదుపాయాలు... ఇవన్నీ ఏకమై 45 నిమిషాలపాటు ఏకధాటిగా సృష్టించిన తీవ్ర గందరగోళ స్థితి శనివారం రాత్రి న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కి సలాటకు దారితీసి 18 మంది ప్రాణాలను బలి తీసుకుంది. ఈ మరణాలకు సంతాపం ప్రకటించటం, బాధిత కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేయటం సరే... జరిగిన ఘోర ఉదంతానికి నైతిక బాధ్యత వహించాల్సిందె వరు? ఇలాంటివి పునరావృత్తం కానీయ బోమని చెప్పేదెవరు? మన దేశంలో ఎప్పుడు జనసమ్మర్దం అధికంగా ఉంటుందో, ఏ చర్యలు అవసరమో అధికార యంత్రాంగానికి తెలియక కాదు. అందుకు సంబంధించి ఇప్ప టికే బోలెడు చేదు అనుభవాలున్నాయి. కానీ ఎన్ని జరుగుతున్నా గుణపాఠం నేర్వని మనస్తత్వమే ఈ విషాద ఘటనకు దారితీసింది. కుంభమేళా జరుగుతున్న ప్రయాగ్‌రాజ్‌లో తొక్కిసలాట చోటు చేసుకుని 30 మంది ప్రాణాలు బలై పక్షం రోజులు కాలేదు. అదే ప్రయాగ్‌రాజ్‌కు బయల్దేరిన భక్తులకు ఢిల్లీ రైల్వే స్టేషనే ఈసారి మృత్యుఘంటిక మోగించిందంటే నేరం ఎవరిదనుకోవాలి? తొక్కిసలాట జరిగిన అజ్మీరీ గేట్ టెర్మినల్ గురించి ఉత్తరాదిలో పనిచేసే రైల్వే ఉన్నతాధికారులకూ, ప్రత్యేకించి న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ అధికారులకూ తెలియంది కాదు. సాధారణ దినాల్లో సైతం ఆ టెర్మినల్ కిక్కిరిసివుంటుంది. ఢిల్లీ మెట్రో రైల్‌ను నేరుగా అనుసంధానం చేసే ప్రాంతమది. పైపెచ్చు వాహనాల పార్కింగ్‌కు అనువైనది. యూపీ మీదుగా వెళ్లాల్సిన రైళ్లు ఆగే అయిదు ప్లాట్ ఫాంలు అజ్మీరీ గేట్ టెర్మినల్ ప్రాంతంలోనే ఉన్నాయి. దానికితోడు ఇప్పుడు కుంభమేళా సంరంభం కొన సాగుతోంది. తగిన ప్రణాళిక రూపొందించుకుని, అదనపు జాగ్రత్తలు తీసుకోవడా నికి ఈ కారణాలు చాలవా? సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటలలోపు బయల్దేరే రైళ్లను అందు కోవటానికి వచ్చే జనరల్ కంపార్ట్‌మెంట్ ప్రయాణికులకు అక్కడ రోజూ 7,000 టిక్కెట్లు విక్రయి స్తారు. కానీ శనివారం రోజు కేవలం రెండు గంటల వ్యవధిలో అదనంగా మరో 2,600 మందికి టిక్కెట్లు విక్రయించారు. అంటే రిజర్వేషన్‌లేని ప్రయాణికుల సంఖ్య దాదాపు పదివేలు! ఇంత మంది టికెట్ల తనిఖీ అసాధ్యం. కనుక టికెట్ లేకుండా ప్రయాణించేవారు ఇంతకు మూడు నాలుగు రెట్లు అధికంగా ఉంటారని ఒక అంచనా. అందుబాటులో ఉన్న బోగీలెన్నో, జారీ చేయాల్సిన టికెట్లెన్నో కనీస అంచనాకు రాకపోవటం... అవసరమైన పోలీసు బలగాలను సమకూర్చుకోవాలన్న స్పృహ లోపించటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఘటన జరిగినప్పుడు ఆ ప్రాంతంలో 20 మంది పోలీసులు మాత్రమే ఉన్నారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. వారు సైతం ఈ తొక్కిస లాట సమయంలో 'బతుకుజీవుడా' అనుకుంటూ పక్కకుపోయారు. పర్యవసానంగా 'రక్షించండి...' అంటూ ఆర్తనాదాలు చేస్తున్నవారి కోసం పోర్టర్లే రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. వారే గనుక ఆపద్బాంధవుల్లా రాకపోతే మరింతమంది మృత్యువాత పడేవారు. కుంభమేళా సందర్భంగా డిమాండ్ ఎక్కువుంది గనుక ఉన్న రైళ్లను సమయానికి నడిపుంటే ఇంత జనసమ్మర్దం ఉండేది కాదు. ఎంతో జాప్యం జరిగి ఒకదాని వెనక మరొకటిగా వరసపెట్టి మూడు రైళ్లుండటం వల్ల 14, 15 నంబర్ ప్లాట్‌ఫాంలపై వేలాదిమంది పడిగాపులు పడుతున్నప్పుడే ప్రయాగ్‌రాజ్ వెళ్లే ప్రత్యేక రైలుపై వెలువడిన అనౌన్స్‌మెంట్ తీవ్ర గందరగోళానికి దారితీసి తొక్కిసలాట జరిగిందంటున్నారు. మన దేశం వరకూ చూస్తే తొక్కిసలాటల్లో దాదాపు 80 శాతం మతపరమైన పవిత్ర దినాల్లో, తీర్థయాత్రల్లో ఎక్కువగా జరుగుతున్నట్టు 2013లో ఒక అధ్యయనం తేల్చిచెప్పింది. భారీగా వచ్చి పడే ప్రజానీకాన్ని నియంత్రించటానికి జాతీయ విపత్తు నివారణ ప్రాధికార సంస్థ ఆ ఏడాదే సవివరమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఇప్పుడు సాంకేతికత మరింత విస్తరించి సీసీ కెమెరాలు, డ్రోన్‌ల వంటివి అందుబాటులోకొచ్చాయి. వీటి సాయంతో ఎప్పటికప్పుడు కంప్యూటర్ మానిటర్ లలో పర్యవేక్షిస్తూ అవసరమైన చోటకు బలగాలను తరలించటానికి, చర్యలు తీసుకోవటానికి పుష్క లంగా అవకాశాలున్నాయి. ఎక్కడో మారుమూల అడవుల్లో నక్సలైట్లను అణచడానికి వినియోగిస్తున్నామంటున్న సాంకేతికత దేశ రాజధాని నగరంలో కొలువుదీరిన రైల్వే స్టేషన్‌లో ఎందుకు ఆచూకీ లేకపోయిందో పాలకులు చెప్పగలరా? విషాదం చోటుచేసుకున్నప్పుడల్లా దాన్ని తక్కువ చేసి చూపటానికి, అంతా నియంత్రణలో ఉందని చెప్పటానికి పాలకులు తెగ తాపత్రయపడుతుంటారు. 2015లో రాజమండ్రిలో తన కళ్ల ముందే పుష్కరాల్లో 29మంది భక్తులు ప్రాణాలు కోల్పోతే చంద్రబాబు ఎంతటి నిర్లక్ష్యాన్ని ప్రదర్శించారో ఎవరూ మరిచిపోరు. మొన్నటికి మొన్న తిరుపతి తొక్కిసలాట జరిగినప్పుడూ ఆయనది అదే వైఖరి. ఇప్పుడు న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ ఉదంతంలోనూ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ట్వీట్ ల ప్రహసనం సైతం అలాగే వుంది. శ్రావణబెళగొళ, స్వర్ణాలయం వంటి చోట్ల ఇంతకు మించి ఎన్నో రెట్లు అధికంగా భక్తులు తరలివస్తారు. కానీ ఎప్పుడూ ఎలాంటి అపశ్రుతులూ చోటు చేసుకోలేదు. ఇందుకు వారు అనుసరిస్తున్న నియంత్రణ చర్యలేమిటో అధ్యయనం చేయాలన్న స్పృహ కూడా ఎవరికీ ఉన్నట్టు లేదు. ఈ విషాదం చెప్పే గుణపాఠాన్ని గ్రహించకపోతే, తప్పు తమది కానట్టు ప్రవర్తిస్తే మళ్లీ మళ్లీ ఇలాంటివే చోటు చేసుకుంటాయి. కమిటీలు, విచారణల తంతు సరే... నిర్దిష్టంగా తాము గ్రహించిందేమిటో, ఇకపై తీసుకోబోయే చర్యలేమిటో ప్రకటిస్తే జనం సంతోషిస్తారు.

# కృపా నిరీక్షణ మినిస్ట్రీస్‌లో ఘనంగా ఈస్టర్ వేడుకలు

**చట్టం, అబ్దుల్లాపూర్మెట్ :** ఈస్టర్ పర్వదినాన్ని పెద్ద అంబర్పేట్ 4వ వార్డ్ పరిధి శాంతినగర్ కాలనీలోని కృపా నిరీక్షణ మినిస్ట్రీస్ లో క్రైస్తవులు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. చర్చిలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక గీతాలు ఆలపిస్తూ, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పునరుత్థానుడైన ప్రభువును కీర్తించారు. ఈ సందర్భంగా పాస్టర్ సిల్వధర్ మాట్లాడుతూ.. లోక పాపములను పరిహరించడానికి ఏసుక్రీస్తు అరుదెంచాడని తెలిపారు. సర్వమానవుల రక్షణార్థమై ఏసుక్రీస్తు శిలువపై రక్తం చిందించారని పేర్కొన్నారు. శిలువ వేయబడిన మూడవ దినమున మరణాన్ని గెలిచి తిరిగి లేచారని చెప్పారు. ఈ పవిత్రమైన రోజునే ఈస్టర్ పండుగగా జరుపుకుం టున్నామని పేర్కొన్నారు. ఆయన శాంతి, ప్రేమ, క్షమాపణ, కరుణ గుణాలను అనుసరిస్తూ ప్రతి ఒక్కరూ వాటిని పాటించాలన్నారు. అనంతరం ఒక రికొకరు ఈస్టర్ పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, యువతీ, యువకులు, మహిళలు, పిల్లలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# ఈనెల 26న సప్తశతి పుస్తకావిష్కరణ

**చట్టం, సిద్దిపేట ప్రతినిధి :** ఈనెల 26 శనివారం రోజున ఉదయం 10గంటలకు ప్రెస్ క్లబ్ సిద్దిపేటలో కవి వంగరి వెంకటేశం రచించిన సప్తశతి మణిపూసలు పుస్తకావిష్కరణ ప్రెస్ క్లబ్ సిద్దిపేటలో కలదని బాలసాహితీ వేత్త ఉండ్రాళ్ళ రాజేశం అన్నారు. అన్ని పూసల కవిత దినోత్సవం ఏడవ వార్షికోత్సవం సందర్భంగా ఏడు వందల మణిపూసలు పుస్తకావిష్కరణ జరగడం సంతోషమని ఇట్టి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు ఆదివారం మధ్యాహ్నం ప్రెస్ క్లబ్ సిద్ది పేటలో ఆవిష్కరణ చేశారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ జల్లిపల్లి బ్రహ్మం అతిథులుగా అడ్డగూడి ఉమాదేవి, ఆశీర్వాదం, వడిచర్ల సత్యం, మచ్చ అనురాధ, దోమకొండ అంజయ్య, నూనె రాజయ్య, ఐత చంద్రయ్య, పట్నం భూపాల్, సంగీతం నరసింహారావు, కుందారం యాదగిరి, సిహెచ్ రాజు తదితరులు హాజరవుతారని కవులు, రచయితలు, సాహితీ ప్రియులు పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. ఇట్టి కరపత్ర ఆవిష్కరణలో పుస్తక రచయిత వంగరి వెంకటేశం, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షులు ఎన్నవెల్లి రాజమౌళి, పుస్తక సమీక్షకులు వరుకోలు లక్ష్మయ్య, శాడ వీరారెడ్డి, అనిశెట్టి సతీష్ కుమార్, బాలచంద్రం, నూనె రాజయ్య, యాదగిరి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాడుతా

- పీపీ గా అవకాశం ఇచ్చినందుకు సీఎం, మంత్రులకు కృతజ్ఞతలు
- పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవన్ రెడ్డి

**చట్టం, సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత సిద్దిపేట జిల్లా ప్రధాన కోర్టుకు మొట్టమొదటి రెగ్యులర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా రాష్ట్ర ప్రభుత్వం తనకు అవకాశం కల్పించిందని అడ్వకేట్ జీవన్ రెడ్డి తెలిపారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా తన వంతుగా ప్రభుత్వానికి సహకారం అందిస్తానన్నారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు పోరాడడంతోపాటు నిందితులకు శిక్ష పడేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. బాధితులకు ఎలాంటి సహాయ సహకారాలు అవసరం ఉన్న వాటిని తీరుస్తానన్నారు. సిద్దిపేట జిల్లా కోర్టులో ఇప్పటివరకు చాలా కేసులు పెండింగ్లో ఉన్నాయని వాటిపై దృష్టి సారించి కేసులు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా కోర్టు నిర్వహించే ప్రతి సమీక్షలో పాల్గొని కేసులు పరిష్కరిస్తామన్నారు. క్షణికావేశంతో చేసిన నేరాల వల్ల ఎంతోమంది కుటుంబాలకు దూరమవుతున్నారన్నారు. నేరాలకు పాల్పడిన వారందరికీ శిక్షలు పడేలా చేసి ఇలాంటి నేరాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. ఈ మీడియా సమావేశంలో అడ్వకేట్ పత్రి ప్రకాష్, ఖలిముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.




# రెండు దశాబ్దాల తర్వాత గురునాథ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**చట్టం, సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా మిట్టపల్లి శివారులోని కె ఎన్ ఆర్ క్రిసో రిసార్ట్ లో రెండు దశాబ్దాల తర్వాత 20042005 విద్యా సంవత్సరం SSC పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక అంగరంగ వైభవంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రెటరీ జగ్గు మల్లారెడ్డి హాజరయ్యారు. అనంతరం బి స్మార్ట్ స్టేట్ జనరల్ సెక్రటరీ జగ్గు మల్లారెడ్డి మాట్లాడుతూ..రెండు దశాబ్దాల తర్వాత విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకొని, గురువులను సన్మానించుకోవడం సమాజానికి గురుతరమైన బాధ్యతగా భావించవచ్చన్నారు. చిన్ననాటి నుండి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, విద్య నేర్పిన గురువులకు, చదువుకున్న పాఠశాలకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని మల్లారెడ్డి తెలిపారు. సమాజం నాకేమిచ్చింది అనే బదులు సమాజానికి మనం ఏం చేశాము అని ప్రతి వ్యక్తి గుర్తెరిగిన రోజు సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ... వివిధ హోదాలలో స్థిరపడడానికి కృషిచేసిన గురునాథ విద్యాలయం ప్రధానోపాధ్యాయులు మల్లారెడ్డికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. వారి చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకొని, ఆనందంలో తేలియాడారు. అనంతరం గురువులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో గురునాథ విద్యాలయం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




# పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి శూన్యం

- పిఎసిఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి
- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత నవీన్ గుప్తా

**చట్టం, శివ్వంపేట :** భారత రాష్ట్ర సమితి పార్టీ ముఖ్య నాయకులకు ప్రతిరోజు చిల్లర రాజకీయాలు చేయడం అలవాటుగా మారిందని, ఆ పద్ధతి మంచిది మంచిది కాదని అభివృద్ధిపై మంచి రాజకీయాలు చేయాల్సిన అవసరం ఉందని శివ్వంపేట పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత పులిమామిడి నవీన్ గుప్తా హితువు పలికారు. ఆదివారం నాడు నవీన్ గుప్తా స్వగృహంలోని క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నేత పులిమామిడి నవీన్ గుప్తా మాట్లాడుతూ మాజీ జెడ్పిటిసి సభ్యులు మహేష్ గుప్తా,మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, హయాంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, స్వార్ధ రాజకీయాల కోసం ప్రస్తుతం శివ్వంపేట పెద్ద చెరువు కట్టను మాజీ జెడ్పిటిసి సభ్యులు మహేష్ గుప్తా ఇప్పుడు మరమ్మతులు చేయించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీపై గాని, పార్టీ నాయకుల పై గానీ బిఆర్ఎస్ పార్టీ నాయకులు అసత్యపు ఆరోపణలు చేస్తే ఊరుకునే పరిస్థితి లేదని నవీన్ గుప్తా హెచ్చరించారు. 17 నెలల పాలనలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం శివ్వంపేట మండలంలో సిసి రోడ్ల నిర్మాణానికి సుమారు నాలుగు నుంచి ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేసిందని ఆయన గుర్తు చేశారు. ఈ ఘనత కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి కి దక్కిందన్నారు. డబ్బులతో రాజకీయాలు చేసేవారు నిజమైన నాయకులు కాదని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని నవీన్ గుప్తా అన్నారు. 10 సంవత్సరాలలో శివ్వంపేటలో ఎటువంటి ప్రభుత్వ భవనాలు నిర్మించలేదని అన్నారు. స్థానికంగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు లేని సమస్యలు కావాలని సృష్టిస్తున్నారని నవీన్ గుప్తా తీవ్రంగా మండిపడ్డారు. పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత చిలుముల మదన్ రెడ్డి హయాంలో మంజూరైన ఉసిరిక పల్లి, గోమారం, నవాబుపేట, పోతుల బోగుడ, వరకు డబుల్ బీటీ రోడ్డు పనులు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ హయాంలోనే జరుగుతున్నాయని ఆయన గుర్తు చేశారు. వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి ఇదివరకే తీసుకువెళ్లడం జరిగిందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరుగుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ నాయని వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు వారాల గణేష్, బుర్ర మురళి గౌడ్, పెద్దపులి సతీష్, బిస్కుందు అంజయ్య, కమలయ్య గారి వెంకటేష్, బిజిలిపురం సత్తయ్య, షేక్ అలీ, బండారి నాగేష్, వంజరి గౌరీ శంకర్, బలవంత రెడ్డి, దావూద్, దానబోయిన కృష్ణ, ఇసారపు రాజు గౌడ్, మెతుకు మల్లేష్, సోను, వర్రె మహేష్ యాదవ్, వర్రే కార్తిక్ యాదవ్, కొత్తపేట నాగేష్ తదితరులు ఉన్నారు.



# నేడు ధర్పల్లిలో భూభారతిపై అవగాహన

**చట్టం, ధర్పల్లి:** ధర్పల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాలకు భూభారతి పై అవగాహన సదస్సు ఉన్నదని, ధర్పల్లి తాసిల్దార్ మాలతి ఆదివారము ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రైతులు మండల అధికారులు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆమే సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు విచ్చేస్తున్నందున భూభారతిపై పలు విషయాలపై రైతులకు ఆయన అవగాహన కల్పించనున్నారని తెలిపారు. ధరణిలో పరిష్కారం కానీ సమస్యలన్నీ భూభారతిలో పరిష్కారం అవుతాయని, భూమి సమస్యలు, రైతులకు భూములపై భరోసా కల్పించడానికి భూభారతిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, దానిపై పూర్తి అవగాహన రైతుల్లో కలిగేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఆమె తెలిపారు.



# ఉచిత ఆరోగ్య శిబిరం



**చట్టం, రెంజల్ :** రెంజల్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం జీవన్ సేవ వెల్ నెస్ ఆధ్వర్యంలో ఆయుర్వేద, న్యాచురోపతి ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ నాగనాథ్, డాక్టర్ హర్షద్ బాడీ స్కానింగ్ ద్వారా సుజోక్ థెరపీ, మసాజ్ థెరపీ, ఆక్యుపెక్చర్, నేచురోపతి 100 మంది పైగా ప్రజలకు పరీక్షలు నిర్వహించి కీళ్ల నొప్పులు, మధుమేహం, థైరాయిడ్, కిడ్నీ సమస్యలు, లివర్ సమస్యలు, గుండె సమస్యలు, గ్యాస్ ట్రబుల్, చర్మవ్యాధులు, హెర్ కేర్, దమ్ము దగ్గు, ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి ఆయుర్వేద, న్యాచురోపతి, గురించి సలహాలు సూచనలు ఇవ్వడం జరిగిందని డాక్టర్ నాగనాథ్ తెలిపారు. కీళ్ల నొప్పులు, నరాల సమస్యలు ఉన్నవారికి బ్లెడ్ సర్కులేషన్ మిషన్ ద్వారా రక్త ప్రసరణ ఏ విధంగా జరుగుతుందనేది చూపించారు. ఆయుర్వేద, న్యాచురోపతి, సమస్యల గురించి సలహాలు, సూచనలు తెలిపిన డాక్టర్ నాగనాథ్, డాక్టర్ హర్షద్ లకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవన్ సేల్ వెల్ నెస్ సిబ్బంది రామ్మోహన్ రెడ్డి శివ నారాయణ విశ్వనాథ్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు



**చట్టం, రామగుండం :** మాజీ మంత్రివర్యులు కొప్పుల ఈశ్వర్ కి రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాదు కనకదుర్గ దేవాలయంలో మాజీ మంత్రికి పూల బోకే అందించారు. కొప్పుల ఈశ్వర్ నిండు నూరేళ్ళు ఆయుర్ ఆరోగ్యం తో జీవించాలని కోరుకంటి చందర్ ఆకాక్షించారు. మాజీ తెలంగాణ హౌజింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్, మాజీ కార్పోరేటర్ పెంట రాజేష్ కూడా జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు.

# శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం



**చట్టం, ధర్పల్లి:** ధర్పల్లి మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో ఆదివారం శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఏడవ వార్షికోత్సవాన్ని విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు యజ్ఞము అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు గ్రామ మహిళలు హారతులతో స్వామివారికి పల్లకి సేవ నిర్వహించారు. ప్రతి ఏటా వార్షికోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# ట్రాక్టర్ ప్రమాదంలో ఒకరు మృతి



**చట్టం, నిజామాబాద్ ప్రతినిధి :** నిజామాబాద్ జిల్లా సిరికొండ మండల పరిధిలో గల కొండాపూర్లో ఆదివారం బ్రతుకు దేరవు కొరకు వచ్చిన కొందరు బీహార్ చెందినవారు సిరికొండ మండలంలో కొన్ని పనులు చేసుకుంటూ బ్రతుకుతున్నారు. వివరాల్లోకెళ్తే ఎస్సై రామ్ తెలిపిన వివరాల ప్రకారం సిరికొండ మండల పరిధిలో గల కొండాపూర్ లో బట్టు. జబ్బార్ అనే వ్యక్తి అధిక మోతాదులో మద్యం సేవించి బీహార్ కి చెందిన ముగ్గురు హమాలీలపై ట్రాక్టర్ ను పోనించాడు. ఆ ఘటనలో భూమా ముత్తు (60) అక్కడికక్కడే మరణించాడు. చింటూ కుమార్, గోవింద్ కుమార్ వీరిద్దరి నడుము పైనుండి వెళ్లడంతో వారు తీవ్రంగా గాయపడటంతో సిరికొండ ఎస్సై రామ్ గాయపడిన వారిని హుటాహుటిన నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిరికొండ ఎస్సై ఎల్ రామ్ సంఘటనకు సంబంధించి వివరాలు తెలుపుతూ ట్రాక్టర్ డ్రైవర్ మద్యం తాగి నడపడంతో ప్రమాదం జరిగిందని తెలిపాడు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతాయని. మద్యం తాగి వాహనం నడపడం నేరమని అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎల్. రామ్ తెలిపారు. చనిపోయిన వ్యక్తి ముత్తు కుమారుడి ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



**చట్టం, గాంధారి :** కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గండివేట్ సొసైటీ కేంద్రంలో జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గాంధారి ఏఎంసీ చైర్మన్ బండారి పరమేష్ మాట్లాడుతూ రైతులను ఉద్దేశించి గ్రామీణ రైతుల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం చాలా హర్షణీయం విషయం అని తెలిపారు. ఈ జొన్నల కేంద్రాల ద్వారా రైతులు తమ ఉత్పత్తిని నేరుగా ప్రభుత్వానికి విక్రయించే అవకాశం కలుగుతుంది. మద్దతు ధరతో పాటు తగిన గౌరవం లభించడంతో రైతులకు ఆర్థిక భద్రత కలుగుతుంది. కొనుగోలు కేంద్రాల ప్రారంభం వల్ల మధ్యవర్తుల దౌర్జన్యం తగ్గుతుంది.దోపిడీకి గురికాకుండా నష్టాల నుంచి బయటపడతారు అని ఏఎంసీ చైర్మన్ బండారి పరమేష్ తెలిపారు. ఈ చర్యతో ప్రభుత్వం రైతుల పట్ల చూపిస్తున్న చొరవ స్పష్టంగా కనిపిస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సాయిరాం, వైస్ చైర్మన్ బన్సీలాల్, డైరెక్టర్ల బృందం, గండివెట్ గ్రామ అధ్యక్షుడు సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వంతో స్పందించి ఆర్థిక సహాయం



**చట్టం, రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీ పరదిలోని 14వ వార్డ్ పోచమ్మ బస్తీ ఏరియాకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు పానుగంటి వెంకటేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అయన కుటుంబం నిరుపేద కావడంతో పట్టణం భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులం దరూ కలిసి 17 వేల 700 రూపాయలను మృతి చెందిన కుటుంబ సభ్యులకు ఆ సంఘం గౌరవ అధ్యక్షుడు గాండ్ల సమ్మయ్య, అధ్యక్షుడు జీలకర్ర రాయమల్లు చేతుల చేతుల మీదుగా అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్రబెల్లి రాజేష్, సంగ రవికుమార్, భవన నిర్మాణ కార్మిక సంఘం జనరల్ సెక్రెటరీ బొప్ప శంకర్, ట్రెజరీ కత్తెర సతీష్, సభ్యులు బాదావత్ రాజు, ముంత శ్రీనివాస్, కల్లేపల్లి ప్రసాద్, బొబ్బిలి వీరస్వామి, చొప్పరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీసీ నేత జాజుల లింగం గౌడ్ జన్మదినం



**చట్టం, మిర్యాలగూడ :** గత రెండు దశాబ్దాలుగా బీసీల కోసం పోరాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ జన్మదినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా ఎలాంటి స్వార్థం లేకుండా బడుగు బలహీన వర్గాల కోసం,నిరుద్యోగ యువత కోసం, విద్యార్థుల స్కాలర్షిప్స్, ఫీజు రియంబర్స్మెంట్స్ కోసం లింగంగౌడ్ పోరాడడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ధోనీటి శేఖర్, నక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యులకు దడ పుట్టిస్తున్న గుండె జబ్బులు

ఇటీవల కాలంలో ఏ నోట విన్నా గుండె పోటుతో మరణించినట్లు నిత్యం పత్రికలలో వార్తలు వస్తున్నాయి. చిన్న తనం లోనే గుండె పోటు కి గురి అయి మరణించే వారి సంఖ్య అధికంగా వుంటుంది. పట్టుమని 20 యేళ్లు నిండనీ వారు కూడా మృత్యువు గుండె పోటు రూపంలో కబలిస్తో వుంది. నిత్యం వ్యాయామం, యోగ చేస్తూ, ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ, మితా ఆహారం తీసుకుని, డిప్రెషన్ కి దూరం గా వున్న గుండె పోటు తప్పడం లేదని సర్వేలు వెల్లడిస్తున్నాయి. రాబోయే రోజులలో మన దేశంలో గుండె పోటు మరణాలు అధికంగా ఉంటాయి అని సాక్షాత్తు ఆరోగ్య నిపుణులు అంటున్నారు గుండెపోటు, గుండెజబ్బులను నివారించడానికి 1946లో జెనీవాలో వరల్డ్ హార్ట్ ఫౌండేషన్ సంస్థ ఏర్పాటయ్యింది. 2000 సంవత్సరం నుండి ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ నెల ఆఖరి ఆదివారం నిర్వహించబడిన ప్రపంచ హృదయ దినోత్సవం 2011 సంవత్సరం నుండి సెప్టెంబర్ 29వ తేదీన నిర్వహించబడుతుంది. గుండెజబ్బు అనేది నేడు సమాజం ఎదుర్కొంటున్న అతి పెద్ద అనారోగ్య సమస్య. గతంలో కేవలం వృద్ధులకు మాత్రమే వచ్చే గుండెజబ్బులు నేడు యుక్తవయస్కుల్లో కూడా రావడం ఆందోళనకర పరిణామం. అత్యంత ఆధునిక వైద్య సదుపాయాలు ఉన్న ప్పటికీ ఎక్కువమంది మరణిస్తున్నది గుండె జబ్బుతోనే. ప్రపంచవ్యాప్తంగా సగటున సంవత్సరానికి ఒక కోటీ డెబ్బైఐదులక్షల మంది అంటే 39 శాతం మరణాలు సంభవిస్తున్నవి అని చెప్పవచ్చు. గుండె జబ్బులతోనే. ఈసంఖ్యను 2030 వరకు 25 శాతం తగ్గించడం లక్ష్యంగా ప్రపంచ హృదయ సంస్థ కృషిచేస్తున్నది. గుండెవ్యాధికి అనారోగ్య సమస్యలు, వైద్యపరమైన కారణాల కన్నా సామాజిక, మానసిక సమస్యలు ప్రధాన కారణం. ఒత్తిడికి లోనవడం, మానసిక పరంగా డిప్రెషన్ కు లోను కావడం, చిన్న సమస్యలను పెద్దగా తీసుకోవడం, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్,




శాఖాహారం తగ్గించి మాంసాహారం ఎక్కువగా తినడం, ఉప్పు, కారం, మసాలాలు,నూనెలు అధికంగా తినడం, బాల్యం నుండే జంక్ ఫుడ్ కు అలవాటు పడటం వంటి కారణాల వల్ల నేడు గుండె జబ్బులు అధికంగా రావడానికి కారణం అవుతున్నాయనీ డాక్టర్స్ అంటూ వున్నారు. తలిదండ్రులు పిల్లల ఆటలు, వినోదానికీ సరిగా సమయం కేటాయించలేక , మొబైళ్ళు, కంప్యూటర్ వంటి డిజిటల్ ఉపకరణాలతో కాలక్షేపం చేయిస్తున్నారు. ఇక స్కూళ్ల లో ఆటస్థలాలే లేకుండా, ఆటల్లేకుండా బాల్యంనుండి యవ్వనంలోకి అడుగిడుతూ యుక్తవయసుకొచ్చేసరికి శరీరం, కండరాలకు తగినంత శక్తి లేకపోవడంతో 20 25 ఏళ్లకే మధుమేహం, హైబీపీల బారిన పడుతున్నారు. వ్యాహ్యాళికీ, వాకింగ్‌కీ వసతుల్లేని పార్కులూ, ఆటస్థలం లేని స్కూళ్లు. ఆడించని పాఠశాలలు ఇవన్నీ అనారోగ్యానికి హేతువులు. నేటి బాలలు రేపటి భావి భారత పౌరులకు' బదులుగా 'నేటి బాలలే రేపటి రోగులుగా' తయారవుతున్నారు. దానికి తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆలోచించాల్సిన అవసరం ఉంది. బాల్యం నుండే విద్యార్థులకు ఆహారము, వ్యాయామము, విలువలతో కూడిన విద్య, ఒత్తిడిలేని విద్యపై అవగాహనను ఏర్పరచాలి. ఏ వయసు వారైనా వాకింగ్, యోగ, ప్రాణాయామము, ధ్యానము, వ్యాయామం చేయడం, మానసిక ఉల్లాసం కలిగించే సంగీతము, కళలు, పుస్తకాలు చదవడం వంటివి అలవర్చుకోవాలి. ఇవన్నీ సమస్యలో సమగ్ర భాగం. మన ఆరోగ్యానికి మంచి ఆహారమేమిటో మనందరికీ తెలుసు. సరదా, కాలక్షేపాలకోసం మనతోపాటు పిల్లలకు సైతం జంక్‌ఫుడ్ తినిపిస్తున్నాం. కూల్‌డ్రింక్‌లతో జరిగే నష్టం తెలిసీ ప్రసార మాధ్యమాలమోజులో తాగిస్తున్నాం. బాల్యంలోనే వికృత రుచులకు అల్వాటు అనేకంటే బానిసలై ప్రకృతి రుచులను మరచిపోతున్నారు. వయసుతోపాటే రోగాల తాకిడీ పెరుగుతున్నది. మాంసాహారాన్ని త్యజిస్తే గొప్ప వ్యత్యాసం తెలుస్తుంది. మాంసాహారులకంటే శాఖాహారులు తక్కువ బరువుతో ఉంటారు. శాఖాహారుల్లో గుండెవ్యాధుల ప్రమాదం 40శాతం తక్కువగా ఉండటం వల్ల మరో ఏడేళ్ళపాటు ఆదనంగానూ, ఆరోగ్యంగానూ జీవిస్తారు. వ్యాయామ అవసరమెంతో తెలుసు. వ్యక్తులతో పాటు వ్యవస్థాపరమైన మార్పులు అవసరం.

**యోగ, శారీరక వ్యాయామాలకు ప్రాధాన్యత ఇవ్వాలి**

ఈమధ్య కాలాల్లో 'యోగా'ను పెద్దఎత్తున ప్రోత్సాహించారు. ప్రభుత్వాల నుండి, సమాజంనుండీ విధానపరమైన ప్రోత్సాహం ఉంటున్నంది. ఉదయాన్నే లేచి సూర్యకిరణాలు చూస్తూ కొంత వ్యాయామం చెయడం శరీరానికి, మనసుకి కనీసావసరం. యోగధ్యానము ప్రాణాయామము వంటి వాటిని మత విశ్వాసానికి సంబంధించిందని కొందరు భావించడం వారి సంకుచిత మనస్తత్వం తెలియజేస్తుంది. నిజానికి యోగా కాణీ ఖర్చులేని సంపూర్ణ ఆరోగ్య జీవన విధానం. వయసుతో నిమిత్తంలేకుండా శరీరం కండరాలు అనుమతించినంతరకు ఆసనాలు వేయవచ్చు.

**ఇక ధ్యానం శ్వాసపై ధ్యాసను నిలిపే ప్రక్రియ.**

యోగా ధ్యానాలతో కండలు పెరగకపోయినా శారీరక ధృఢత్వం, మానసిక స్థిరత్వం పెరుగుతాయి. ప్రపంచ యోగా దినోత్సవవం జూన్ 21 తేదీన నిర్వహించుకోవడం యోగా ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ప్రపంచ యోగా దినోత్సవం జరుపుకోవడానికి అన్ని దేశాలనుండి పెద్ద మద్దతు వచ్చింది.

**ధూమపానం, మద్యపానాలు త్యజించాలి**

ధూమ పానం, మద్యపానాలు వల్ల కూడా చాలా మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు వీటితో సంక్రమించే కేన్సర్, మధుమేహం, పక్షవాతం గుండెజబ్బుకు ఆదనపు మద్దతునిస్తాయి. ఈఅలవాట్లను విసర్జించడానికి కావలసింది మానసిక స్థైర్యం. సాంప్రదాయిక అలవాట్లు, ఆహారవిధానాలకు దూరమై తిరోగమన పద్ధతులకు చేరువయ్యాం.

**ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం**

కావున ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరచుకుని మానసికంగా శారీరకంగా సామాజికంగా దూరంగా ఉండి సరైన ఆహార నియమాలు పాటిస్తూ యోగా ప్రాణాయామము వ్యాయామాలు చేస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవన విధానంతో గుండెజబ్బులను దరిచేరనీయకుండా చూసుకోవచ్చు. ప్రతి ఒక్క పౌరుడు తగు జాగ్రత్తలు పాటిస్తూ హృదయం పదిల పరుచుకొని గుండెపోటు ముప్పు నుంచి తమను తాము రక్షించుకుంటారని ఆశిద్దాం.


**కామిడి సతీశ్ రెడ్డి,**
**జయశంకర్ భూపాలపల్లి జిల్లా,**
**తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు**




## గుర్తు తెలియని మృతదేహం లభ్యం



**చట్టం, బీర్కూర్:** బీర్కూరు మండలం బైరాపూర్ గ్రామంలో గల ఊర చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభించింది అని స్థానిక ఎస్సీ రాజశేఖర్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మృతుని వయసు సుమారు 30 నుండి 40 సంవత్సరాలు ఉంటుందని, ఇట్టి మృతుడు బైరాపూర్ గ్రామ ఊర చెరువులో పడి చనిపోయి దాదాపు 24 గంటలు అవుతుంది అని ఒంటిపై గోధుమ కలర్ షర్టు మరియు కాఫీ కలర్ ప్యాంటు కలదు అని తల వెంట్రుకలు మరియు గడ్డము ఉండి నలుపు రంగులో కలదు ఎవరికైనా గుర్తుతెలిసినచో స్థానిక మండల పోలీస్ స్టేషన్లో గాని బాన్సువాడ రూరల్ తెలియజేయగలరని తెలియజేశారు.

## కారు ప్రమాదంలో బాలుడు మృతి



**చట్టం, రామగుండం :** గోదావరిఖని గంగానగర్ నందు ఆదివారం ఉదయం అందాద 10:30 గంటలకు పులిపాక శివరాజ్ కుమార్ s/o రమేష్ 3 సంవత్సరాలు, కులం: sc మాదిగ, అను అతను ఆడుకోవడానికి రోడ్డు పైకి రాగా అతివేగంగా నడుపుకుంటూ వచ్చిన కారు అట్టి బాలుడికి టక్కరి ఇవ్వగా వెంటనే ప్రభుత్వాసుపత్రికి తీసుకొని వెళ్ళగా డాక్టర్లు పరిశీలించి చనిపోయినాడు అని తెలిపినారు, తండ్రి పులిపాక రమేష్ గోదావరిఖని 1 టౌన్ లో కేసు నమోదు చేసాడు. సబ్ ఇన్స్పెక్టర్ L.భూమేష్ కేసు దర్యాప్తు చేస్తామన్నారు. కారు మరియు కారు నడిపిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు.

## ఆర్టిఐ నేత చర్లపల్లికి పరామర్శ

- **రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడీ సతీష్ రెడ్డి**
- **ఆర్టిఐరాష్ట్ర కమిటీ సభ్యుడు కమలాకర్**



**చట్టం, భూపాలపల్లి ప్రతినిధి :** ఇటీవల రోడ్ ప్రమాదములో గాయపడ్డ భూపాల్ పల్లి జిల్లా సమాచార హక్కు చట్టం యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్టీఐ జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు ను మొగుళ్ళ పల్లి మండలం ఎల్లా రెడ్డి పల్లి గ్రామంలో ఆదివారం రోజున తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్య క్షులు కామిడి సతీష్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సమాచార హక్కు ముఖ్య సలహాదారులు కల్వల కమలాకర్ రావు లు పరామర్శించారు ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. సమాచార హక్కు చట్టాన్ని ప్రతీ గ్రామము లోకి తీసుకు వెళ్లిన వెంకటేశ్వర్లు రోడ్ ప్రమాదములో గాయపడడం బాధాకరం అన్నారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## చైతన్యపురిలో బీజేపీ గావ్ చలో బస్తీ చలో



**చట్టం, దిల్ సుఖ్ నగర్:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు అటల్ బీహారీ వాజ్ పేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా గావ్ చలో బస్తీ చలో కార్యక్రమం చైతన్యపురి డివిజన్ లో బిజెపి నాయకుడు బొల్లం యష్పాల్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్వచ్ఛ భారత్, జెండా ఆవిష్కరణ, సహపంక్తి భోజనం కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చ నాయకురాలు నందికొండ గీతారెడ్డి, బిజెపి స్టేట్ కౌన్సిల్ నెంబర్ కొర్లపల్లి స్వామి, మరియు డివిజన్ యువమోర్చా ప్రెసిడెంట్ ప్రసాదం కిరణ్ భరత్ నగర్ ఫేస్ 2 శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ దేవాలయం శుభ్రం చేయడం జరిగింది. భరత్ నగర్ ఫేస్ 2 కమ్యూనిటీ హాల్ దగ్గరలో భారతీయ జనతా పార్టీ జెండాను ఆవిష్కరించారు మరియు స్వాతంత్ర్య సమరయోధుడు యాపట్ల బాలస్వామిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బూత్ ప్రెసిడెంట్ జంగయ్య, భాస్కర్, రాజేందర్, చెన్నయ్య, శ్రీనివాస్ నరసయ్య, శ్రీనివాస్ గౌడ్, రమేష్, వినోద్, వెంకట్, రాజు, సంప్రిత్, తరుణ్, వరుణ్, విష్ణు, భావన్, శివమణి, పవన్, శ్రీసాయి, చింటూ, శ్రీశైలం, సైదులు, మహిళలు జంగమ్మ, లక్ష్మి, లక్ష్మమ్మ , ప్రేమలత, నరసమ్మ, లక్ష్మీ బాయ తేదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఏరియా హాస్పటల్‌లో ఆధునిక క్యాథ్ ల్యాబ్ పనులు

- **సందర్శించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**చట్టం, రామగుండం :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (SCCL) నడుపుతున్న సింగరేణి ఏరియా హాస్పటల్‌లో హృద్రోగ నిర్ధారణ మరియు చికిత్సల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధునిక క్యాథెటరిజేషన్ ల్యాబ్ (Cath Lab)ను స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పనులను సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఇప్పటి వరకూ హార్ట్ సంబంధిత అత్యవసర పరీక్షలు, శస్త్రచికిత్సల కోసం రోగులు ఇతర పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఇక్కడే అందుబాటులోకి వచ్చిన ఈ క్యాథ్ ల్యాబ్‌తో గ్రామీణ ప్రజలకు పెద్ద ఎత్తున ఉపయోగం కలుగుతుంది," అని అన్నారు. హృదయ సంబంధిత సమస్యలకు త్వరితగతిన నిర్ధారణ, చికిత్సలు అందించగలిగే విధంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఈ ల్యాబ్ ఏర్పాటు చేయడం సింగరేణి హాస్పటల్ వైద్య సేవలలో మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. క్యాథ్ ల్యాబ్ ప్రారంభంతో ఆసుపత్రి సేవల స్థాయి మరింత మెరుగవుతుందని, అత్యవసర హార్ట్ చికిత్సలు, యాంజియోగ్రఫీ, యాంజియోప్లాస్టీ వంటి నిపుణుల పర్యవేక్షణలో జరగనున్నట్లు హాస్పటల్ సూపరింటెండెంట్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తాజా మాజీ కార్పొరేటర్ పెద్దల్లి ప్రకాష్ తేజశ్వేని, తాజా మాజీ కార్పొరేటర్లు,సింగరేణి ఉన్నతాధికారులు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## రామకోటి రామరాజు కృషి, పట్టుదల అమోఘం

- **అపర రామభక్తికి మెచ్చి ముత్యాల హారం బాహుకరణ**
- **గ్రామ, గ్రామాన రామభక్తిని నింపడం ఓ అద్భుత ఘట్టం : భద్రాచల దేవస్థానం ఏఈఓ శ్రవణ్ కుమార్**
- **గోటి తలంబ్రాల్లో పాల్గొన్న భక్తులకు తలంబ్రాలు అందజేస్తాం : రామకోటి రామరాజు**



**చట్టం ప్రతినిధి, సిద్దిపేట (దుబ్బాక) :** రామనామమే ప్రాణమని సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ ఆధ్వర్యంలో భద్రాచల సీతారాముల కల్యానానికి ప్రతి సంవత్సరం గోటి తలంబ్రాలు అందిస్తున్నది. ఈ సంవత్సరం కూడా 250 కిలోలు అందించారు. భద్రాచల దేవస్థానం ఏఈఓ శ్రావణ్ కుమార్ ఆదివారం నాడు శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు దంపతులచె ప్రత్యేక పూజలు జరిపి, శాలువాతో ఘనంగా సన్మానించి, 100 కిలోల ముత్యాల తలంబ్రాలు అందజేశారు. రామకోటి రామరాజు నిశ్వార్థ అపర రామభక్తికి మెచ్చి ముత్యాల హారాన్ని కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఏఈఓ శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఆణువణువున రామనామాన్ని నింపుకొని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, గ్రామాన తిరిగి వడ్లను గోటితో ఒలిపించి ప్రతి సంవత్సరం భక్తితో కళ్యానానికి అందిచడం రామకోటి రామరాజు రామభక్తి ఎంత గొప్పదో మాటలో చెప్పలేనిది అని కొనియాడారు. గత 26 సంవత్సరాలనుండి రామకోటి ప్రతి భక్తునిచే లిఖింపజేపిచ్చి జీవితాన్నే రామునికి అంకితం చేసి అపర రామదాసుగా చరిత్రలో నిలిచిపోయాడన్నారు. ఈయన రామకోటి రామరాజు సేవలు అమోఘమని, అపర రామదాసుగా గతంలోనే కీర్తించామని తెలిపారు. 20 కిలోలు ఒకసారి, 150 కిలోలు మరోసారి, 250 కిలోలు ఈసారి ఇవ్వడం కృషి, పట్టుదల ఉన్న రామకోటి రామరాజుకే సాధ్యం అన్నారు. రామకోటి రామరాజు మాట్లాడుతూ త్వరలో భక్తులందరికి తలంబ్రాలు అందజెస్తానమని తెలిపారు.

## రైతు మహోత్సవ కార్యక్రమంను విజయవంతం చేయాలి

- **మండల వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి**




**చట్టం, ఎల్లారెడ్డి:** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 21 నుండి 23 వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రైతు మహోత్సవం జరగనున్నట్లు ఎల్లారెడ్డి వ్యవసాయ శాఖ సంచాలకులు ఐఏఎస్ డాక్టర్ బీ. గోపి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని స్థానిక డిగ్రీ కాలేజీ గ్రౌండ్ లో జరిగే ఈ రైతు మహోత్సవ కార్యక్రమంను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఇక మూడు రోజులపాటు జరిగే ఈ రైతు మహోత్సవంలో తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల రైతులు వారు పండించిన ఉత్పత్తులు రైతు మహోత్సవ ప్రదర్శనలో పెట్టనున్నట్లు తెలిపారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ఉత్పత్తులు సైతం రైతు మహోత్సవ కార్యక్రమంలో ఉండనున్నట్లు ఎల్లారెడ్డి అగ్రికల్చర్ డైరెక్టర్ బీ. గోపీ తెలిపారు. దాదాపు 150 కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అందులో వ్యవసాయం మరియు అనుబంధ విభాగాలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, స్టార్టప్‌లు, FPOలు మరియు ప్రైవేట్ కంపెనీలకు సంబంధించిన స్టాల్స్ ఉంటాయన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మరియు ప్రగతిశీల/ అవార్డు గ్రహీత రైతులచే కొత్త సాంకేతికత పద్ధతులపై 3 రోజుల వర్క్‌షాప్ ఉంటుందని ఎల్లారెడ్డి వ్యవసాయ శాఖ సంచాలకులు బీ గోపి తెలిపారు. మూడు రోజులపాటు జరిగే రైతు మహోత్సవ కార్యక్రమంకు వేలాదిమంది రైతులు పాల్గొనే అవకాశం ఉందని, ఈ మహోత్సవాన్ని విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలనీ సూచించారు.

## హాస్టల్ ఆవరణలో టేకు చెట్ల నరికివేత



**చట్టం, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి లోని ఎస్సీ బాలికల హాస్టల్ ఆవరణలో ఉన్న టేకు చెట్లను వార్డెన్ శారద నరికివేయించి దుంగలను అక్కడే ఎవరికీ కనిపించకుండా పెట్టించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు ఉన్నతాధికారుల అండదండలతో వార్డెన్ సుమారు 20 టేకు చెట్లను నరికివేయించారంటున్నారు. ఒక చెట్టును అధికారులు తొలగించాలంటే రెవెన్యూ లేదా ఫారెస్ట్ అధికారుల అనుమతులు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ.. వార్డెన్ శారద తనకు సంబంధం లేని చోట టేకు చెట్లను నరికివేయించినా పట్టించుకునే వారు కరువయ్యారనీ, టేకు చెట్లను నరికివేయించిన వార్డెన్ శారద విద్యార్థుల కోసం సరఫరా అయ్యే బియ్యాన్ని సైతం అమ్ముకుంటున్నారని, ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ చేస్తున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



**చట్టం, ఎల్లారెడ్డి:** కామారెడ్డి సత్య కన్వెన్షన్ లో జరిగిన ఉమ్మడి నిజామాబాద్ మరియు కామారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లు దఫేదార్ రాజు, శోభ దంపతుల కూతురు వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేసిన ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, జిల్లా అధ్యక్షులు ముజీబుద్దిన్. ఈ వివాహ వేడుకలో నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపిన సొసైటీ వైస్ చైర్మన్




**చట్టం, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గ క్రైస్తవ సోదర సోదరీమణులకు ఈస్టర్ పండగ శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఎల్లారెడ్డి సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్ తెలిపారు, ఈస్టర్ పండగ సందర్భంగా చర్చికి వెళ్లి ఫాదర్ చారి, హెప్సిబా లతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సొసైటీ వైస్ చైర్మన్ మత్తమాల ప్రశాంత్ గౌడ్ మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ క్రైస్తవ సోదరీ సోదరులకు అనేక సేవలందిస్తున్నాడన్నారు. ఆదివారం ఆయన ఈస్టర్ పండుగ పురస్కరించుకొని నియోజకవర్గంలోని ప్రతి చర్చికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావ్ అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు. అనంతరం ఈ సందర్భంగా నియోజకవర్గం పాస్టర్లు చారి , హెప్సిబా మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా క్రైస్తవులకు మన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ తోడ్పాటును అందిస్తూనారని వారు పేర్కొన్నారు. క్రిస్టియన్లకు తోడ్పాటు అందించడం గర్వించదగ్గ విషయమని కొనియాడారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు బిట్ల సురేందర్, ప్రశాంత్, సోనీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మంత్రి జన్మదిన వేడుకలు




**చట్టం, రామగుండం కమిషనరేట్:** జూలపల్లి మండలంలోని కుమ్మరికుంట గ్రామం నేనున్న ఫౌండేషన్ కో ఆర్డినేటర్ కొప్పుల శ్రీధర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథిగా పెద్దపల్లి జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్ హాజరై శ్రీరాముల వారి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని, కేక్ కట్ చేసి, స్వీట్లు తినిపించి, ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రఘువీర్ సింగ్ మాట్లాడుతూ... కొప్పుల ఈశ్వరన్న నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండి, మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి, గొప్ప స్థాయికి వెళ్లాలని, కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జూలపల్లి మండల మాజీ ఎంపిపి వీసారపు వెంకటేశం, కుమ్మరికుంట మాజీ ఎంపిటిసి సభ్యులు తమ్మడవేణి మల్లేశం, నాయకులు కొత్త శ్రీధర్, కుంట రాజేశ్వర్ రెడ్డి, పొలగాని సతీష్, దొంత ప్రవీణ్, సూర యోసఫ్, దొంత తేజ, నల్లతీగల సతీష్, బండి రాజిరెడ్డి, కొప్పుల అజిత్, కందుల లచ్చయ్య, కొంకటి వెంకటేశ్, కొప్పుల శాంతయ్య, సంది స్వామి, సంది జయరాజు, పొన్నం వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

## కొచ్చేరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



**చట్టం, నసురుల్లాబాద్:** భక్తులకు కోరికలు తీర్చే కొచ్చేరి మైసమ్మ అమ్మవారు కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండల పరిధిలోని మైలారం గ్రామ శివార్లో గల ఒక భారి వృక్షం కింద వెలిసారు. అమ్మవారికి భారీ సంఖ్యలో ఆదివారం, మంగళవారం, శుక్రవారం ఉమ్మడి మండల ప్రజలే కాకుండా చుట్టుపక్క జిల్లాల ప్రాంతాల నుండె కాకుండా చుట్టుపక్కల గల, కర్ణాటక, మహారాష్ట్ర నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి కోరికలు తీర్చిన అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అక్కడే భక్తులు కుటుంబ సభ్యులతో వనభోజనాలు చేస్తారు ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు, ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తారు, ఆలయం వద్ద భక్తుల సంఖ్య పెరగడంతో ఆలయ అభివృద్ధి కోసం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆలయ పరిసర ప్రాంతాల్లోని సిసి రోడ్లు కాటేజెస్ కోసం ప్రత్యేక నిధులు కేటాయించి ఆలయానికి అభివృద్ధికి సహకరిస్తున్నారని భక్తులు తెలిపారు.

## శివ్వంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**చట్టం, శివ్వంపేట :** మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం నాడు ప్రభుత్వ ఆదేశాలను సారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మండల పరిధిలోని ఉసిరిక పల్లి చెన్నాపూర్ పెద్ద గొట్టిముక్కుల గ్రామాలలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శివ్వంపేట పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి, వైస్ చైర్మన్ నాయని వేణుగోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రైతులకు పూర్తి న్యాయం జరిగే విధంగా సరైన గిట్టుబాటు ధర కల్పించి అందజేస్తామన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తుందని వెంకట్రామిరెడ్డి, గుర్తు చేశారు. ప్రతి సంవత్సరం కూడా రైతులకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలోగిట్టుబాటు ధర కల్పిస్తుందని ఆయన వివరించారు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

## నూతన ట్రాలీ అందజేసిన హైకోర్టు న్యాయవాది



**చట్టం, శివ్వంపేట :** మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గూడూరు గ్రామపంచాయతీ పరిధిలో చెత్తను తొలగించడానికి గాను గతంలో ప్రభుత్వం ట్రాక్టర్ ఇంజన్ మాత్రమే మంజూరు చేయడం జరిగింది. గూడూరు గ్రామంలో చెత్త తొలగించడానికి ఇబ్బందిగా ఉందని ట్రాక్టర్కు ట్రాలీ అవసరం ఉందని గ్రామ తాజా మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్ గౌడ్, అదే గ్రామానికి చెందిన రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది జి,రమాదేవి శివకుమార్ గౌడ్ దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది, సర్పంచ్ విజ్ఞప్తిపై స్పందించిన రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది రమాదేవి శివకుమార్ గౌడ్ తక్షణమే గ్రామపంచాయతీ సిబ్బందికి ట్రాక్టర్ నూతన ట్రాలీని అందజేయడం జరిగింది. దీంతో గూడూరు గ్రామస్తులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు అడిగిన వెంటనే కాదనకుండా గ్రామపంచాయతీకి నూతన ట్రాలీని బహుకరించిన న్యాయవాది రమాదేవి శివకుమార్ కు మాజీ సర్పంచ్ స్వరాజ్యలక్ష్మి శ్రీనివాస్ గౌడ్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

## చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు



**చట్టం, శంకరపట్నం :** తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను శంకరపట్నం మండల కేంద్రంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ మానకొండూరు నియోజకవర్గం కన్వీనర్ మోరే ప్రభాకర్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైని సన్మానించిన మైనారిటీ నేతలు



**చట్టం, లింగంపేట్ :** లింగంపేట్ నూతన ఎస్ఐ బాధ్యలు చేపట్టిన వెంకట్రావును మైనార్టీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతలు పరిరక్షణలో ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ మైనార్టీ విభాగ ఉపాధ్యక్షులు మహమ్మద్ ఫతియోద్దీన్, మునీర్, హర్షద్, ఇమామ్, సలీం తదితరులు ఉన్నారు.

## చైన్ స్నాచింగ్ కేసును ఛేదించిన పోలీసులు



**చట్టం, రామకృష్ణాపూర్:** రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హనుమాన్ నగర్ ఏరియాకు చెందిన బుర్ర రాజేంద్రప్రసాద్ అనే వ్యక్తి కిటికీ పక్కన మొబైల్ ఫోన్ పెట్టి నిద్రస్తుండగా ఆదివారం తెల్లవారుజామున చోరీకి గురైంది. అంతేకాకుండా ఆ ఇంటికి ఎదురుగా ఉన్న మరొక ఇంట్లో కిటికీ పక్కన నిద్రిస్తున్న ఇరుముల్ల శరణ్య అనే మహిళ మెడలో ఉన్న 3 తులాల పుస్తెల తాడుని గుర్తుతెలియని దొంగ కిటికీలో నుంచి లాగి అపహరణకు గురిచేసి ద్విచక్ర వాహనంపై పారిపోయాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి సీసీ కెమెరాల సాంకేతిక పరిజ్ఞానంతో 24 గంటల లోపే కేసును సేధించారు. సింగరేణి ఏరియా ఆస్పత్రి వద్ద వాహనాలను తనిఖీలు చేస్తుండగా ఒక ఎఫ్.జెడ్ వాహనంలో వెతకగా అతని వద్ద దొంగలించిన మూడు తులాల పుస్తెలతాడు, మొబైల్ ఫోన్ దొరకడంతో ఆ దొంగపై రెండు కేసులు నమోదు అయినట్లు బెల్లంపల్లి ఏసీపీ రవి రవి కుమార్ పేర్కొన్నారు. దొంగలించిన వ్యక్తి పేరు ఇమాన్యూల్ (23) గోదావరిఖనికి చెందిన వాడుగా గుర్తించామని, జలసాలకు అలవాటు పడి గతంలో కూడా దొంగతనాలకు పాల్పడడంతో ఆ పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా అతనిపై కేసులో ఉన్నట్లు పేర్కొన్నారు. చాకచక్యంగా పట్టుకోవడానికి కృషి చేసిన మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి, స్థానిక ఎస్సై జీ.రాజశేఖర్, కాజీపేట ఎస్సై ప్రవీణ్, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ సుందర్ రావు, శ్రీనివాస్, సతీష్ లను ప్రత్యేకంగా అభినందించి రివార్డును అందజేశారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



**చట్టం, మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా మాసాయిపేట మండలంలోని పోతన్ శెట్టిపల్లి గ్రామంలో ఇటీవల ఇద్దరు యువకులు మరణించిన విషయం తెలిసిందే కాగా పోతాన్ శెట్టిపల్లి గ్రామస్తులందరూ కలిసి వారి కుటుంబ సభ్యులకు బండారి వేణుగోపాల్ మరియు దానోల్ల వెంకటేష్ కుటుంబాలకు ఆదివారం గ్రామస్తులందరి సహకారంతో మరణించిన ఒక్కొక్కరి కుటుంబానికి 44000 రూపాయల చొప్పున ఆర్థిక సాయం చేయడం జరిగింది. అలాగే ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యం అందించారు. ఇది గ్రామస్తుల అందరు సహకారంతో వారి రెండు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా వారి రెండు కుటుంబాలకు ఎల్లవేళలా వెన్నంటూ ఉంటామని తెలిపారు. పోతన్ శేట్టి పల్లి గ్రామం లాగా అన్ని గ్రామాలు ఇలాగే సహాయం చేస్తూ గ్రామాలలో ఇలాంటి ఆపదల్లో గ్రామస్తులందరూ కలిసికట్టుగా ఉండి వారి కుటుంబాలకు మనోధైర్యాన్ని ఆ కుటుంబాలకు ఇవ్వాలని పోతన్ శెట్టిపల్లి ప్రజలు అన్నారు. ఇలాంటి ఆపదలు జరిగినప్పుడు వారి కుటుంబాలకు ప్రజల సహకారం ఎంతో అవసరం పోతన్ శెట్టిపల్లి గ్రామ ప్రజలు అన్నారు.

# నిజాయితీగ బతకడం కష్టమే, అదే నిజమైన శాంతిని ఇస్తుంది

- **లాడేగావ్‌లో పూజ్య శ్రీ డాక్టర్ బసవలింగ అవధూత ప్రవచనం**



**చట్టం, జుక్కల్ :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం లాడేగావ్ గ్రామంలో ప్రవచన కార్యక్రమంలో భాగంగా పూజ్య శ్రీ డాక్టర్ బసవలింగ అవధూత మహారాజ్ (మల్లయ్య గిరి & దేగల్ మడి ఆశ్రమ పిఠాధిపతి) గ్రామం చిల్లపల్లి, కుప్పనగర్ మండలం ఝరాసంగం జిల్లా సంగారెడ్డి వారిని మహిళలు నిండు కాలేశములతో డప్పు చెప్పుచప్పుళ్ళ మధ్య ఘన స్వాగతం పలికారు. ప్రవచన కార్యక్రమంలో మాట్లాడుతూ.. తట్టుకుంటారో, ఎవరికైతే ఓపిక ఉంటాదో వారు భగవత్ ధ్యానం చేస్తారు. భగవంతునికి ధ్యానం ఎవరైతే చేస్తారో వారికి పుణ్యం లభిస్తుంది.

**అక్క మాదేవి గురుంచి చెప్తు..**

అక్కమహాదేవి మహాభక్తురాలే కాదు... గొప్ప రచయిత్రి కూడా. కన్నడలో ఆమె 400లకు పైగా వచనాలు రాసినట్లు గుర్తించారు. ప్రతి వచనంలోనూ 'చెన్న మల్లికార్జునా!' అనే మకుటం కనిపించడం వల్లే అవి అక్కమహాదేవి రాసిన వచనాలుగా భావిస్తున్నారు. ఆమె వచనాలలో శివుని పట్ల ఆరాధన, ఈ ప్రకృతి పట్ల నమ్మకం, ఐహిక సుఖాల పట్ల వైరాగ్యం స్పష్టంగా కనిపిస్తాయి. వీటిలో ఆధ్యాత్మిక రహస్యాలను చెప్పే గూఢార్థాలు కూడా ఉన్నాయని నమ్ముతారు. కన్నడలో ఈమెని తొలి రచయిత్రిగా భావించేవారూ లేకపోలేదు. అక్కమహాదేవి రాసిన వచనాలను తెలుగులోకి కూడా అనువదించారు. దొరికితే తప్పకుండా చదవండి. అందులో అరుదైన ఆణిముత్యాలు ఎన్నో కనిపిస్తాయి. మచ్చుకి ఒక వచనం ఇదిగో.... మట్టిపెల్లలవలె కరిగికరిగి, ఇసుకదిబ్బలవలె జరిగి కలలో కలవరపడి నేను వెరగొందిగి అవములో నిప్పువలె చుట్టిచుట్టి కందితిని ఆపదలో ఆప్తులనెవరిని కాన వెదకి కానని తనువును, కలసిన కూడని సుఖమును నాకు కరుణించుమో చెన్నమల్లికార్జునా.. అక్కమహాదేవి. ఈ పేరు వినగానే శ్రీశైలంలో ఆమె పేరు మీదుగా ఉన్న ఒక గుహ గుర్తుకువస్తుంది. విశాలమైన ఆ గుహలో ఆమె సుదీర్ఘకాలం తపస్సు చేసుకుందని చెబుతారు. కానీ అక్క మహాదేవి కేవలం ఒక భక్తురాలు మాత్రమే కాదు. సమాజాన్ని ధిక్కరించిన ఒక విప్లవకారిణి. భక్తి ఉద్యమానికి కొత్త ఊపు ఇచ్చిన రచయిత్రి. ఆ పరమేశ్వరుని తన భర్తగా భావించిన భక్తురాలు. అక్క అన్న పేరు నిజానికి ఒక బిరుదు మాత్రమే. ఈ భక్తురాలి అసలు పేరు మహాదేవి. శివభక్తులైన ఆమె తల్లిదండ్రులు ఆమెను సాక్షాత్తూ ఆ పార్వతీదేవి అవతారంగా భావించారు. అందుకనే ఆమెకు మహాదేవి అన్న పేరు పెట్టారు. నిజంగానే పార్వతీదేవి పుట్టిందా అన్నట్లు మహాదేవి మొహం తేజస్సుతో వెలిగిపోతూ ఉండేదట. దానికి తోడు నిత్యం శివపంచాక్షరి మంత్రాన్ని జపిస్తూ తనదైన లోకంలో ఉండేదట. మహాదేవి పుట్టిన ఊరు కర్ణాటకలోని ఉడుతడి అనే చిన్న గ్రామం. ఒకసారి ఆ రాజ్యాన్ని ఏలే కౌశికుడు అనే రాజు గ్రామపర్యటనకు వెళ్లాడు. అక్కడ అందరితో పాటుగా రాజుగారి ఊరేగింపును చూస్తూ నిల్చొన్న మహాదేవిని చూసి రాజు మనసు పారేసుకున్నాడు. వివాహం చేసుకుంటే ఆమెనే చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు. కానీ మహాదేవి మనసు అప్పటికే పరమేశ్వరుని మీద లగ్నమైపోయింది. అలాగని రాజుగారి మాట కాదంటే తన కుటుంబానికి కష్టాలు తప్పవు. అందుకని మహాదేవిఒక మూడు షరతులతో రాజుగారిని వివాహం చేసుకోవడానికి ఒప్పుకున్నదట. ఆ పరమేశ్వరుని తనకు తోచిన రీతిలో, తోచినంతసేపు ధ్యానించుకోవచ్చునన్నది ఆ షరతులలో ఒకటి. అక్కమహాదేవి షరతులకు లోబడి రాజుగారు ఆమెను వివాహం చేసుకున్నారు. కానీ అనతి కాలంలోనే ఆమె షరతులను అతిక్రమించాడు. దాంతో ఆమె కట్టుబట్టలతో రాజమందిరం నుంచి బయటకు వచ్చేశారు. తర్వాత కర్ణాటకలో వీరశైవానికి కేంద్రంగా ఉన్న కళ్యాణ్కు చేరుకున్నారు. అప్పటికే అక్కడ బసవేశ్వరుడు, అల్లమ ప్రభువు వంటి ప్రముఖులు ప్రజలందరినీ భక్తిబాటలో నడిపిస్తున్నారు. అలాంటి పండితులందరూ ప్రవచనాలు చేసేందుకు, తమ వాదనలు వినిపించేందుకు అక్కడ అనుభవ మండపం పేరుతో ఒక వేదిక ఉండేది. మహాదేవి ఆ అనుభవ మండపాన్ని చేరుకుని... శివుని మీద తనకి ఉన్న అభిప్రాయాలు, అనుభూతులను పంచుకున్నారు. మహాదేవి వాదనాపటిమను, పాండిత్యాన్ని చూసి ఆశ్చర్యపోయిన పెద్దలంతా ఆమెకు 'అక్క' అన్న బిరుదుని అందించారు. అలా మహాదేవి కాస్తా అక్కమహాదేవిగా మారింది. ఎవరైతే ఆకలికి తట్టుకుంటారో, ఎవరికైతే ఓపిక ఉంటాదో వారు భగవత్ ధ్యానం చేస్తారు. భగవంతునికి ధ్యానం ఎవరైతే చేస్తారో వారికి పుణ్యం లభిస్తుంది. తల్లితండ్రులతో ప్రేమ తో ఉండండి. వారికీ పిడికెడంత అన్నం పెట్టండి. అనంతరం భక్తులందరికి అన్నప్రసాదం వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ ప్రవచన కార్యక్రమంలో లాడేగావ్ గ్రామస్తులు చుట్టూ ప్రక్కన ఉన్న గ్రామ భక్తులు వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భూ భారతి చట్టంతో భూ సమస్యలు పరిష్కారం



**చట్టం, కోల్చారం :** ధరణి వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం భూ భారతి చట్టం అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. ఆదివారం కుల్చారం మండలం రైతు వేదికలో భూభారతి చట్టం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్,ఆర్డీవో మహిపాల్ రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు భూభారతి చట్టంపై కళా ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భూభారతి చట్టం సందేశం రైతులకు వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా సమస్యలు పరిష్కరించుకునే అవకాశం లభిస్తుందన్నారు.నూతన భూ చట్టం తో భూ సమస్యలు పరిష్కారం కాబోతున్నాయని రైతులు భూ యజమానులు ఏవైనా సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ధరణిలో లేదని, కానీ ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టంలో సమస్యలు, అభ్యంతరాలు తెలియజేసే అవకాశం కల్పించిందన్నారు. భూసమస్యల పరిష్కరించేందుకు రైతులు, ప్రజలు, మేధావుల అభిప్రాయాలు, సూచనలతో భూభారతి చట్టాన్ని ప్రభుత్వం రూపొందించిందన్నారు. రైతులు, భూ యజమానులు భూభారతి చట్టం ద్వారా తమ భూ సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. తమ సమస్యలను హెల్ప్ డెస్క్ లో అందజేయవచ్చన్నారు. మెదక్ జిల్లా కుల్చారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, భూ యజమానులు, ప్రజలు తమతమ భూసమస్యలు, వాటి పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ఈ అవగాహన సదస్సులో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రైతులు, భూయజమానులు అడిగిన ప్రశ్నలకు భూభారతి చట్టం ద్వారా వాటికి ఉన్న పరిష్కారాలను తెలియజేస్తూ ఆర్డీవో మహిపాల్ రెడ్డి సమాధానాలిచ్చారు. భూభారతి చట్టంలోని మార్గదర్శకాలను ఆర్డీవో చదివి వినిపించారు. చట్టంలోని వివరాలను తెలియజేసే కరపత్రాలను రైతులు, భూ యజమానులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ గఫర్, డీఈఓ రాధా కిషన్, వ్యవసాయ శాఖ అధికారి పుణ్యావతి, ఇతర ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## నేడు పోల్కంపేటలో భూభారతి అవగాహన

- **పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ అశ్వఖ్**



**చట్టం, లింగంపేట్ :** లింగంపేట మండలంలోని పోల్కంపేట గ్రామంలో సోమవారం రోజున భూభారతి అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని పంచా యతీ కార్యదర్శి మహమ్మద్ అశ్వఖ్ తెలిపారు.ఈసందర్భంగా అయన మాట్లాడుతు గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించే భూభారతి అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలుకార్యక్రమంలో పాల్గొని తమ భూసమస్యలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భూసమస్యలపై ప్రజల ఫిర్యాదులు తీసుకుని సమస్యలకు అధికారులు పరిష్కారం చూపిస్తారని అన్నారు. గ్రామ ప్రజలు నిర్వహించి భూభారతి సదస్సులో పాల్గొనాలని సూచించారు. రైతులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## టర్పాలిన్లు అమ్మ పోయి తప్పిపోయిన యువకుడు



**చట్టం, రామాయంపేట :** రోజువారీగా రామాయంపేట నుండి సరుకు తీసుకొని పాపన్నపేట సైడ్ అమ్మడానికి పోయిన వ్యక్తి మిస్సయిన ఘటన చోటు చేసుకుంది వివరాల్లోకి వెళితే బాబులు సింగ్ s/o విశానాథ్ సింగ్, (23), ప్రాంతం: వ్యాపారం r/o అలపూర్, సైరువా, కానాపూర్ UP రాష్ట్రం అను వ్యక్తి గత నాలుగు సంవత్సరాల క్రితం యూపీ నుండి రామయంపేటకు వచ్చి బట్టల వ్యాపారం చేసుకుంటూ రెడ్డి కాలనీలో నివసిస్తూన్నాడు. అతడు తేది 18042025న ఉదయం సుమారు 600 గంటలకు బట్టలు అమ్మడానికని తన మోటార్ సైకిల్ పై బొడ్మెట్పల్లి వైపు వెళ్లి తిరిగి రామయంపేటకు ఈరోజు వరకు రాలేదని, అతనికి ఫోన్ చేసినా స్విచ్ ఆఫ్ అని వస్తుంది అని అతని బావ అయిన/ ఫిర్యాదుదారుడు బుక్యా జుగేందర్ సింగ్ s/o తిలక్ సింగ్, (29) కులం: OBC, ప్రాంతం: వ్యాపారం R/o నాగలతోడి, ఖినియానగర్ షా, ఎటా, ఖిర్యా నగర్, ఉత్తరప్రదేశ్ దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు.

## మితిమీరుతున్న ఫైనాన్స్ ఆగడాలు..



**చట్టం, కామారెడ్డి ప్రతినిధి :** జిల్లాలో ఎక్కడో ఓ చోట ఫైనాన్స్ కంపెనీల వేధింపులు ఆగడం లేదు. బాధితులను బెదిరిస్తూ వేధింపులకు గురిచేస్తునే ఉన్నారు. ఇలాంటి సంఘటన కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని టేక్రియాల్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఇద్దరు బాధితులను ఇంటికి తాళం వేస్తామని ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది బెదిరించారు. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... గ్రామానికి చెందిన మద్దికుంట స్వామి, మద్దికుంట పోచయ్య అనే అన్నదమ్ములు. 2023 అక్టోబర్ నెలలో ఇంటిపై ఒక్కొక్కరు 3 లక్షల చొప్పున పట్టణంలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో రుణం తీసుకున్నారు. ప్రతి నెల ఈఎంఐ చెల్లిస్తూ వచ్చారు. గత 3 నెలలుగా ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం కారణంగా ఈఎంఐ చెల్లించలేకపోయారు. దీంతో కంపెనీ సిబ్బంది తరచుగా బాధితుల ఇంటికి, పనిచేస్తున్న చోటికి వెళ్లి ఇబ్బందులకు గురిచేశారు. రెండు రోజుల క్రితం ఈఎంఐ చెల్లించకపోతే ఇంటికి తాళం వేస్తామని బెదిరించారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- **జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే**



**చట్టం, నారాయణఖేడ్:** సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని తడ్కల్ గ్రామంలోని రైతు వేదికలో మార్కుఫేడ్ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా జొన్నల కొనుగోలు కేంద్రాన్ని జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్, శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రారంభించారు. మాట్లాడుతూ... రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రైతులకు అవసరపడే వ్యవసాయ పనిముట్లను సబ్సిడీ ద్వారా రైతులకు అందిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు జొన్నలను 3371 రూపాయల ప్రభుత్వం మద్దతుతో కొనుగోలు చేస్తున్నామన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లారెడ్డి మాట్లాడుతూ... తడ్కల్ రైతులకు చాలా అవసరాలు ఉన్నాయన్నారు.

**తడ్కల్ లో సోసైటీ ఏర్పాటు..**

పెద్ద&చిన్న చెరువుల కాలువ నిర్మాణం పనులు.. పంట నిల్వల కోసం గోదాంల ఏర్పాటు.. విటిపై శాసనసభ్యులు సంజీవ్ రెడ్డి& ఎంపీ సురేష్ శెట్కార్ సానుకూలంగా స్పందించి తప్పకుండ రైతులకు అవసరమయ్యే వసతులు అన్ని కల్పిస్తామని అన్నారు. గోదాంల కోసం ప్రభుత్వ భూమి అవసరం సొసైటీ కోసం మీరు కట్టవలసిన బకాయిలను 90శాతం కట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు పాటు మండల వ్యవసాయ అధికారులు, కంగ్టీ మండల కాంగ్రెస్ ముఖ్య నాయకులు రైతులు పాల్గొన్నారు.

## అన్ని కులాలకు సమన్యాయం కలిగేలా పోరాటం

- **దండోరా జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి**



**చట్టం, శివ్వంపేట :** సమాజంలో వివక్షకు గురైన కులాలన్నిటికీ సమన్యాయం జరిగేలా పోరాటం చేస్తున్నామని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు చెట్లపల్లి యాదగిరి మాదిగ అన్నారు. ఆదివారం మండలంలోని దంతాన్ పల్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నూతన గ్రామ కమిటీ ఆధ్వర్యంలో జండా ఆవిష్కరణ చేశారు. దండోరా రాష్ట్ర అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జాతి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ సమాజంలో అన్ని కులాలకు అండగా నిలిచి 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో ఎస్సీ ఎ బి సి సాధించిన బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంలో పొందుపరిచిన 15శాతం రిజర్వేషన్లు 59 అన్ని కులాలకు సమన్యాయం జరగాలని 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం చేసి వర్గీకరణ సాధించి పద్మశ్రీ అవార్డు సాధించిన మహా నాయకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. వర్గీకరణ విషయంలో 59 ఉప కులాల బహుజన బిడ్డలు విద్యావంతులు పెద్ద చదువులు చదవాలని ఎవరు చదువులు ఆపకుండా తల్లిదండ్రులు బాధ్యత తీసుకొని ప్రతి ఒక్కరిని ఉన్నత చదువులు చదివించాలని అప్పుడే అసమానతలు సంపూర్ణంగా మన నుండి తొలిగిపోతాయని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కన్నారం కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొమ్ము చేకులన్న అన్న మాదిగ, ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు ఉషన్న గళ్ళ మురళి మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పెద్దకొల్ల లింగం మాదిగ, ఎమ్మార్పీఎస్ దంతాలపల్లి గ్రామ కమిటీ నూతన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతితో భూములకు భరోసా

- **అవగాహన సదస్సులలో కలెక్టర్ రాహుల్ రాజ్**

**చట్టం మెదక్ ప్రతినిధి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి' నూతన ఆర్.ఓ.ఆర్ చట్టంతో భూములకు భరోసా లభిస్తుందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రాలలో భూభారతి నూతన చట్టంపై రైతులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులలో కలెక్టర్ పాల్గొని, భూభారతి చట్టంపై, అందులోని అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. కలెక్టర్ భూభారతి చట్టం గురించి క్షుణ్ణంగా వివరిస్తూ కొత్త ఆర్ ఓ ఆర్ చట్టం విధి విధానాలను రైతులకు తెలియజేశారు. భూభారతి చట్టం 2025పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి కలిగి ఉండాలని సూచించారు. నూతన చట్టంలో భూ సమస్యలకు వెసులుబాటు పొందుపరచడం జరిగిందని అన్నారు. భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యలను స్థానిక రెవెన్యూ, ఆర్డిఓ, జిల్లా కలెక్టర్ సత్వరమే పరిష్కరించే అవకాశం ఉన్నందున ఈ చట్టంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మ్యూటేషన్ ద్వారా వచ్చే సమస్యలను పరిష్కరించడం కోసం స్థానిక రెవెన్యూ అధికారులు దరఖాస్తు చేసుకున్న గ్రామాన్ని సందర్శించి వివరాలను పరిశీలించిన అనంతరం రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని తెలిపారు. భూమి సర్వే నెంబర్, సరిహద్దులు , పూర్తి వివరాలు ఏర్పాటు చేసి ప్రతి భూమికి భూదార్ నెంబర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. భూ భారతిలో హక్కుల రికార్డ్ లలో తప్పుల సవరణకు అవకాశం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు గాను ముందుగా భూముల సర్వే, మ్యాప్ తయారీ, గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ, భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, మొదలగునవి భూ భారతిలో కీలక అంశాలని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి, ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తాసిల్దార్ ఇతర జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

CHATTAM NEWS

నిజామాబాద్
సోమవారం
21.04.2025




# మహేందర్ గౌడ్ విగ్రహ ఆవిష్కరణ చేసిన ఎమ్మెల్యే మురళి నాయక్

**చట్టం, మహబూబాబాద్ ప్రతినిధి :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గాజులగట్టు గ్రామం కాంగ్రెస్ పార్టీ సీనియర్ మండల నాయకులు గోపగాని మహేందర్ గౌడ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా మహబూబాబాద్ శాసనసభ్యులు భూక్య మురళి నాయక్ విగ్రహావిష్కరణ చేశారు. గోపగాని మహేందర్ గౌడ్ ఎమ్మెల్యే మురళి ప్రధాన అనుచరుడుగా ఉంటూ తన గెలుపు కోసం మండలంతో పాటు గ్రామంలో అహర్నిశలు కృషి చేశారు.

**మురళి నాయక్ అంటే ఎనలేని అభిమానం**

గూడూరు మండలం గాజులగట్టు గ్రామానికి చెందిన గోపగాని మహేందర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్రను పోషిస్తూ పార్టీ కోసం పార్టీ గెలుపు కోసం పరితపించేవారు. 2024 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలవాలని తపనతో ఏ విధంగానైనా మహబూబాబాద్ జిల్లా నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి భూక్య మురళి నాయక్ ను గెలిపించాలని తపనతో గూడూరు మండలంతో పాటు తన సొంత గ్రామంలో మురళి నాయక్ గెలుపు కోసం పరితపిస్తూ విస్తృతమైన ప్రచారం చేశారు. అనుక్షణం మురళి నాయక్ గెలుపు కోరుతూ తండాలతో పాటు గూడాలు, గ్రామాలు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి మురళి నాయక్ ను గెలిపించాలని కోరారు. గాజులగట్టు గ్రామంలో కొంతమంది నాయకులు తనను ఎంతో



ప్రలోభాలకు గురి చేసిన తలొగ్గకుండ కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేశారు.

**ఫలితాలు రాకముందే పగపట్టిన మృత్యు**

కాంగ్రెస్ పార్టీ గెలవాలని ఆశిస్తూ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన మహేందర్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ గెలుపు చూడకుండానే కన్నుమూశారు. 2023 డిసెంబర్ 22వ తారీఖున గూడూరు మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదం జరిగింది ఈ రోడ్డు ప్రమాదంలో గాయాల పాలైన మహేందర్ గౌడ్ ను హైదరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 2024 మే రెండవ తారీఖున తుది శ్వాస విడిచారు. మహేందర్ మరణ వార్త విన్న స్థానికులు కాంగ్రెస్ పార్టీ గెలుపు చూడకుండానే కనుమూశారు అంటూ రోదించారు. కాంగ్రెస్ పార్టీకి కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన మహేందర్ గౌడ్ మరణ వార్త విన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు దిగ్భ్రాంతికి గురయ్యారు. కాంగ్రెస్ పార్టీలో విలువైన నాయకున్ని కోల్పోయామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

**విలువైన నాయకున్ని కోల్పోయాను - మురళి నాయక్**

కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతూ తన గెలుపు కోసం అహర్నిశలు కృషిచేసిన గోపగాని మహేందర్ గౌడ్ మరణం తిరని లోటు అని కాంగ్రెస్ పార్టీ విలువైన నాయకుని కోల్పోయాము అని ఎమ్మెల్యే మురళి నాయక్ అన్నారు తన గెలుపు కోసం కృషిచేసిన మహేందర్ గౌడ్ కుటుంబ సభ్యులను ఎల్లవేళలా ఆదుకుంటానని తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ అనేక విధాలుగా అండగా ఉంటూ ఆదుకుంటుందని మహబూబాబాద్ శాసనసభ్యులు ముఖ్య మురళి నాయక్ భరోసా ఇచ్చారు. ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు భారత్ చందర్ రెడ్డి, మండల అధ్యక్షులు చిటే వెంకన్న, నెక్కొండ మార్కెట్ వైస్ చైర్మన్ నరేష్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మాలు నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బొల్లెపల్లి మాజీ ఎంపీటీసీ ఆర్యం వీరస్వామి, గాజులగట్టు గ్రామ మాజీ సర్పంచ్ పడిగ వసంత రమేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకన్న గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డిఎస్ బాలు నాయక్, చంద్రమౌళి, సుభాషు గౌడు, బట్టు సుధీర్, కోరే గౌరయ్య, హరిచంద్రు తండ గ్రామ పార్టీ అధ్యక్షులు మాజీ సర్పంచ్ డిఎస్ ధంజా నాయక్, యువ నాయకులు బోడ శ్రీనివాస్ నాయక్, బోడ వాల్యా నాయక్, కార్తీక్ గౌడ్, మహమ్మద్ జావిద్, సాయి, సంఘపు రవి, మాజీ సొసైటీ డైరెక్టర్ శ్రీను, బానోతు విజయ్, బానోతు వాల్యా తదితరులు పాల్గొన్నారు.

## ఊడిపోయిన బస్సు చక్రాలు...



**చట్టం, తూప్రాన్ :** తూప్రాన్ బైపాస్ 44వ జాతీయ రహదారి పై నాగులపల్లి వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో రాజస్థాన్ నుండి 30 మంది ప్రయాణికులతో హైదరాబాద్ అతివేగంగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెళుతుండగా తెల్లవారుజామున బస్సు వెనుక చక్రాలు ఒక్కసారిగా ఊడిపోయాయి. బస్సు డ్రైవర్ అప్రమత్తంగా ఉండడంతో రహదారి పై ఉన్న సైడ్ వాల్ కు బస్సు ఢీకొనడంతో పెను ప్రమాదం తప్పింది. బస్సు ను నెమ్మదిగా ఆపేసాడు. దీనితో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు.

## తాడ్వాయి ఎస్ఐగా రాజయ్య బాధ్యతల స్వీకరణ



**చట్టం, కామారెడ్డి ప్రతినిధి :** మండల పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్ గా రాజయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం, కల్తీకల్లు తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అయితే ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్సై వెంకటేశ్వర్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే.

## ట్రాక్టర్ టైర్ కింద పడి బాలుడు మృతి..



**చట్టం, కామారెడ్డి ప్రతినిధి :** రాజంపేట మండలం గుడి తండాకు చెందిన మాలోత్ చిన్న స్నేహితులతో కలిసి ఇంటి ముందు పార్కింగ్ చేసిన ట్రాక్టర్ పై ఆడుకుంటుండగా ఒక్కసారిగా ట్రాక్టర్ గేర్లు మార్చగా న్యూటల్ గేర్ లోనికి వెళ్లి ట్రాక్టర్ వెనుక వైపు దిగుడుగా ఉండడంతో ట్రాక్టర్ టైర్ కిందపడి మాలోత్ చిన్న మృతి. చెందాడు బాలుని మృతితో కుటుంబంలో, తండాలో విషాదఛాయలు అలముకున్నాయి. బాలుని తండ్రి గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న రాజంపేట పోలీసులు తెలిపారు.

## చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు



**చట్టం, పరకాల :** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75 పుట్టినరోజు సందర్భంగా పరకాల నియోజకవర్గము కూరగాయల మార్కెట్ దగ్గర మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, తెలుగు యువత, చీదురాల రామన్న, కొత్తపల్లి శంకర్, బోయిని రాజశేఖర్,రేవూరి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిధిగా కందుకూరి నరేష్ పాల్గొని కేక్ కట్ చేసి పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాసరి మల్లేశం, మహిళా నాయకులు, మెహరాజ్ బేగం,ఐలమ్మ, సాదు లక్ష్మి, నాగవెల్లి సరోత్తం, సాయిని మొగిలి, ఎన్టీఆర్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీ శారదకి ఆత్మీయ సన్మానం

**చట్టం, మెదక్ ప్రతినిధి :** జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మెదక్ P. లక్ష్మి శారద బదిలీపై వెళ్తున్న సందర్భంగా మెదక్ జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాయా గార్డెన్స్, మెదక్ నందు ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. లక్ష్మి శారద సభను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం న్యాయశాఖ ఉద్యోగులు, లక్ష్మిశారద మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా అందించిన సేవలు మరియు చేసిన కృషిని అభినందించడం జరిగింది. మెదక్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఉదయ్ కుమార్ రెడ్డి ఈ వీడ్కోలు సభలో పాల్గొని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, మెదక్ పి. లక్ష్మి శారద, సేవలను కొనియాడారు. అనంతరం మెదక్ జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు మెదక్ జిల్లా ఎస్పీ, జిల్లా ప్రధానన్యాయమూర్తి,




మెదక్ పి. లక్ష్మీగారద ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జిడ్డి, మెదక్ సిరి సౌజన్య, స్పెషల్ మొబైల్ మెజిస్ట్రేట్, మెదక్ శ్రీ నాయి ప్రభాకర్, మెదక్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఫైర్ అండ్ సేఫ్టీ పాటించాలి

- పోలీస్ కమిషనర్ సాయి చైతన్య
- ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

**చట్టం, కామారెడ్డి ప్రతినిధి :** ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అగ్నిమాపక కేంద్రంలోని అన్ని పరికరాలు క్లుప్తంగా పరిశీలించారు.స్కూలు విద్యార్థులకు ఎస్సే రైటింగ్, డ్రాయింగ్ కాంపిటీషన్ పిల్లలకు బహుమతులు అందజేశారు. రిటైర్ అయిన ఫైర్ ఆఫీసర్లను, లీడింగ్ ఫైర్ మేలు ఫైర్ మాన్లకు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అగ్ని ప్రమాదాలు ఎలా ఎక్కడ సంభవిస్తాయో తెలియదనిఅన్నారు. మన ఇంట్లో కానీ, మనం కూర్చునే కారులో కానీ, మనం ఇక్కడ కూర్చున్న గాని ఎక్కడ ఉన్న కానీ అగ్నిప్రమాదం సంభవించవచ్చని అన్నారు. దానికంటే ముందు మనం ఫైల్ ప్రికాషన్స్ ఫైర్ సేఫ్టీ మెజర్స్ కంపల్సరీ బిగించు




కోవాలన్నారు. కంపల్సరీ పాటించాలన్నారు. ఫైర్ సేఫ్టీ పాటించాలని సూచించారు. అందరూ తప్పకుండా ఫైర్ సేఫ్టీని వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఎ టి. పరమేశ్వర్, పి.నర్సింగ్ రావ్, ఫైర్ ఆఫీసర్ ఆర్మూర్, ఫైర్ ఆఫీసర్ మధుసూదన్ ఐఎన్డీఎఎల్, ఫైర్ ఆఫీసర్ విక్రమ్ పాల్గొన్నారు.

## నాయకత్వం లేని పాలన.. ప్రజాస్వామ్యానికి అవమానం

- సర్పంచ్లేని గ్రామాలు...
- అభివృద్ధి అట్టడుగున పడింది
- ఎన్నికలు లేవు... పాలన లేదు.... సమస్యల సంద్రంలో గ్రామాలు!
- గ్రామ పాలన కోసం ప్రజల పోరు... ఎన్నికలు కావాలంటూ గ్రామస్తుల గళం!



చట్టం, షాద్ నగర్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల గడువు ముగిసి 14 నెలలు దాటినా, ఇప్పటివరకు ఎన్నికలపై ప్రభుత్వం నోరు విప్పలేదు. ఈ నేపథ్యంలో సర్పంచ్లు లేని గ్రామాలు అభివృద్ధిలో ముందడుగు వేయలేక, సమస్యలతో కేకలు వేస్తున్నాయి. ప్రజాప్రతినిధులే లేనిదే గ్రామ పాలన అస్తవ్యస్తమైపోయింది.ప్రధాన రహదారులు గుంతలతో నిండిపోయాయి. పాఠశాలల మరమ్మతులు ఆగిపోయాయి. మిషన్ భగీరథ, డ్రైనేజీ పనులు, నీటి సరఫరా నత్తనడకగానడుస్తున్నాయి. గ్రామానికి నాయకత్వం లేకపోవడమే ప్రధాన కారణంగా గ్రామస్థులు చెబుతున్నారు.గ్రామీణ భారత్ మిషన్, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ వంటి పథకాలు కాగితాల మీదే పరిమితమవుతున్నాయి. సర్పంచ్ లేని పాలన వల్ల పర్యవేక్షణ లేని పనులు నత్తనడకన సాగుతున్నాయి. మండల అధికారులు తీసుకునే నిర్ణయాలు పౌరులతో సమన్వయం లేకుండా అమలవుతున్నాయి. గ్రామాల అభివృద్ధిలో పాలుపంచుకోవాలని భావిస్తున్న యువత హక్కుల కోసం ఎదురు చూస్తోంది.సర్పంచ్ ఉన్నప్పుడు అభివృద్ధి కనిపించేది. ఇప్పుడు సమస్యలు వినేవాళ్లు లేరు అని గ్రామస్థులు వాపోతున్నారు. పాలన లేకుండా గ్రామ అభివృద్ధి అసాధ్యమని పటిష్టంగా చెబుతున్నారు.

**ఎన్నికల ప్రకటన జారీ చేయాలని డిమాండ్**

ప్రజలు, యువత, ప్రజా సంఘాలు స్థానిక సంస్థల ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి.గ్రామాల అభివృద్ధి ఎన్నికల ద్వారానే సాధ్యం అని పలువురు విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

# మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావుపై కేసు నమోదు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే యం. పద్మ దేవేందర్ రెడ్డి

**చట్టం, మెదక్ ప్రతినిధి :** ఈ నెల 17న మెదక్ నియోజకవర్గ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ అతని కేసు నమోదు చేయాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్, ఎమ్మెల్సి శేరీ సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జ్ కంఠరెడ్డి తిరుపతిరెడ్డి బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డినీ కలిసి పిర్యాదు చేశారు. అనంతరం బిఅర్ఎస్ పార్టీ కార్యాలయం లో మీడియా సమావేశం నిర్వహించరు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ ప్రజల గౌరవాన్ని పెంచే విధంగా ఎమ్మెల్యే ప్రవర్తన ఉండాలీ కాని దిగజర్చే విధంగా ఉండొద్దన్నారు.14 సంవత్సరాల పోరాటం చేసి తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేర్చిన కేసీఆర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పై పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మెదక్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాల్సిన ఎమ్మెల్యే ఎదుటివారి మనోభావాలు దెబ్బతీసే విధంగా కుట్రపూరితంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాలు చేసి ఎమ్మెల్యేనే అలాంటి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. సమాజానికి ఏమి మెసేజ్ పంపుతున్నారని ధ్వజమెత్తారు...పద్ధతి మార్చుకొని మెదక్ ను అభివృద్ధి చేయాలని కోరారు.మెదక్ నియోజకవర్గన్నీ అభివృద్ధి చేస్తామని ఎన్నో హామీలు ఇచ్చారనీ వాటిని నెరవేర్చి మెదక్



ను అభివృద్ధి పథంలో నడిపించాలనీ డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలను అమలుపరచాలని డిమాండ్ చేశారు.ఎన్నికల సందర్భంగా రకరకాల హామీలు ఇచ్చి కుట్రపూరితంగా మాట్లాడి ఇక్కడ ప్రజలతో ఓట్లు వేయించుకొని ఇక్కడి ప్రజలను మోసం చేశారన్నారు. ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రామయంపేటలో బిఅర్ఎస్ పార్టీ శ్రేణులు ఫిర్యాదు చేస్తే ఇది మా పరిధిలోకి రాదంటూ ఆ ఫిర్యాదును రిజెక్ట్ చేయడం జరిగింది అన్నారు...అలాంటప్పుడు బిఅర్ఎస్ పార్టీ కార్యకర్త రవీందర్ రెడ్డి నీ పోలీసు స్టేషన్ తీసుకువచ్చి కొట్టి అతని ఫోన్ సీజ్ చేశారు ఇది ఎక్కడి న్యాయం అన్నారు. పోలీసులు ఈ కొట్టుడు సంస్కృతి ఏందన్నారు. తప్పు చేస్తే కేసు నమోదు చేయాలన్నారు. కానీ పోలీసుల పనితీరు ప్రభుత్వానికి ఒక న్యాయం ప్రతిపక్షాలకు ఒక న్యాయంల ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో చట్టం అందరికీ సమానమే అన్నారు..కానీ పోలీసుల తీరు ప్రజాస్వామయుతంగా లేదన్నారు. పోలీసు చర్యల ద్వారా బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను భయపడితే ఉపేక్షించేది లేదు అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టీ కేసులు పెడితే మొదటగ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే మీద కేసు నమోదైన తర్వాత మా కార్యకర్తలను ముట్టుకోవాలన్నారు. మొదట మాట్లాడింది ఎమ్మెల్యే అని గుర్తు చేశారు. అతనిపైన చర్యలు తీసుకున్న తర్వాతనే కార్యకర్తలకు పైన చర్యలు తీసుకోవాలన్నారు. బిఆర్ఎస్ పార్టీకి జోలికి వస్తే ఊరుకునేది లేదు అన్నారు. ఒక్కసారి కేసీఆర్ పిలిపిస్తే వేలాదిగా కార్యకర్తలు తరలివస్తారన్నారు. మూడున్నర సంవత్సరాల పదవి కాలం ఉందని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి వాళ్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వానికి ఒక న్యాయం ప్రతిపక్షాలకు ఒక న్యాయమని డిమాండ్ చేశారు..సిద్ధాంతపరంగా విమర్శలు చేసుకోవాలీ కాని ఇలా మాట్లాడటం సరికాదన్నారు.. ఎమ్మెల్యే చేసిన అనుచిత వ్యాఖ్యలు చాలామంది ట్రోల్ చేశారని వాళ్లపైన ఎందుకు కేసు పెట్టలేదన్నారు. మంచినీళ్ల కోసం, కరెంటుకోసం రైతు భరోసాకోసం రాక రైతుల అవస్థలు పడుతున్నారు వాళ్ల గురించి ఆలోచించాలన్నారు. మెదక్ లో ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో వాళ్ల సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియక మెదక్ నియోజకవర్గ ప్రజలు అవస్థలు పడుతున్నారనీ తెలిపారు. అలాంటిదితెలంగాణ గుండెలో నిలిచిన వ్యక్తి కేసీఆర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తావా మిమ్మల్ని ఇందుకేనా ఇక్కడ ప్రజలు గెలిపించింది విమర్శించారు. ఈ సమావేశంలో మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు ఏం లావణ్య రెడ్డి, మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు కిష్టయ్య, గౌస్, ప్రభు రెడ్డి, మాజీ సర్పంచ్లు లింగం. మేకల సాయిలు, యామ్ రెడ్డి. మైపాల్ రెడ్డి, మోహన్ నాయక్, ఎలక్షన్ రెడ్డి, గంజి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బొట్ల రవి ని పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి..



**చట్టం, పరకాల :** కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న పరకాలలో ఓ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న నడికుడ మండలం ముస్త్యాలపల్లి గ్రామ బిఆర్ఎస్ నాయకులు,మాజీ సర్పంచ్ బొట్ల రవి గారిని పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి గారు పరామర్శించారు.ఈ సందర్భంగా ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరడం జరిగింది. ఆయన వెంట మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

## చల్లా కానుకలు అందజేసిన కార్పొరేటర్..



**చట్టం, పరకాల :** వరంగల్ మహానగర పాలకసంస్థ 16వ డివిజన్ పరిధిలోని వివాహాది శుభకార్యాలకు మరియు పుట్టినరోజు కార్యక్రమాలకు హాజరై చిన్నారులను మరియు నూతన వధూవరులను స్థానిక కార్పొరేటర్ సుంకరి. మనీషా శివకుమార్ ఆశీర్వదించి చల్లా కానుకలు అందజేశారు.

## గావ్ చలో, బస్తీ చలో కార్యక్రమం



**చట్టం, పరకాల :** భారతీయ జనతా పార్టీ ఆవిర్భవ దినోత్సవ సందర్భంగా గావ్ చలో, బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా ఆదివారం పరకాల పట్టణంలోని 22 వార్డులో నిర్వహించడం జరిగినది. ఈ వార్డులో ఉన్నటువంటి సంఘ ప్రముఖులను, ప్రజలను కలిసి దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతో పాటు బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కొరకు కృషి చేస్తున్నారని ప్రజలకు వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. సిరంగి సంతోష్ కుమార్, వార్డ్ ఇంచార్జ్ జిల్లా కార్యదర్శి ఎర్ర రామన్న, 22వ వార్డు మాజీ కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య, బిజెపి నాయకులు మేకల రాజవీరు, పట్టణ మాజీ అధ్యక్షులు మార్త బిక్షపతి, బాసాని సోమరాజు, ఆలేటి రాజేష్, బూత్ అధ్యక్ష కార్యదర్శులు బిజెపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడ పట్టణంలో దొంగల హల్చల్



**చట్టం, కామారెడ్డి ప్రతినిధి :** బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వర కాలని లో దొంగలు చెలరేగిపోయారు చనంగారి అంజయ్య సోదరి మరియు తల్లి సాయమ్మ ఇతర కుటుంబ సభ్యులు రాత్రిపూట ఉడకపోత ఉండడంతో కింద ఇంటికి తాళం వేసి పైన దాబాపై పడుకున్నారు. అర్ధరాత్రి సమయంలో తాళాలు పగల కొట్టి దొంగలు ఇంట్లో చోరబడి సుమారు 12 తులాల బంగారం ,20 తులాల వెండి,21 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా సిఐ అశోక్ మాట్లాడుతూ ఎవరు కూడా ఇంటికి తాళాలు వేసి అజాగ్రత్తగా ఉండకూడదని డాబా పైన పడుకున్న ఆరు బయట పడుకున్న ఇతర గ్రామాలకు వెళ్ళిన తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు పరిశీలన

**చట్టం, హనుమకొండ:** హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలంలోని జయగిరి, అనంతసాగర్, ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సుమారుగా ఎంత ధాన్యం వస్తుందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద చేసిన ఏర్పాట్లను నిర్వాహకులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.



**మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాల సందర్శన**

హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ లోని మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ను జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి సందర్శించారు. ఈ పాఠశాలలో ఎంజేపి బ్యాక్లాగ్ సెట్ ఎంట్రన్స్ టెస్ట్ సెంటర్ ఏర్పాటు చేయగా పరీక్షా కేంద్రంలో పరీక్ష జరుగుతున్న తీరును అదనపు కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా పాఠశాలలో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాలు నిల్వచేసిన వంటగది, స్టోర్ రూమును అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం, ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. కూరగాయలు, ఇతర పదార్థాలు నాణ్యతగా ఉండాలన్నారు. భోజన శాల వంటగది పరిశుభ్రంగా ఉండాలని సూచించారు.

CHATTAM NEWS

చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

## అగ్నిమాపక కేంద్రంలో అవగాహన కార్యక్రమం



**చట్టం, పరకాల :** పరకాల పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో జరిగిన అగ్నిమాపక వారోత్సవం లో భాగంగా ఆదివారం చివరి రోజు జరిగిన కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫైర్ ఆక్సిడెంట్ జరిగినప్పుడు ఏవిధంగా వ్యవహరించాలి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అని అవగాహన కల్పించడం జరిగినది. ఈ కార్యక్రమం నకు ముఖ్య అతిథిలుగా ఏఎంసి మాజీ చైర్మన్ బండి సారంగపాణి, పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ మరియు మాజీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గందే వెంకటేశ్వర్లు మరియు వార్డు ప్రజలు పాల్గొనారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే



**చట్టం, పరకాల :** ఊరుగొండ లోని ఆర్కే కన్వెన్షన్ హాల్ లో పరకాల మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బండి రాణి సదానందం గౌడ్ ల కుమారుడు శ్రావణ్ గౌడ్‌దీప్తి ల వివాహ వేడుకల్లో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ , పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షులు కొయ్యాడ శ్రీనివాస్, సమన్వయ కమిటీ సభ్యులు మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్, కో ఆప్షన్ నెంబర్స్ పసుల లావణ్య రమేష్, పంచగిరి జయమ్మ హరి, చందుపట్ల రాఘవరెడ్డి, ఎర్రబెల్లి భాస్కర్ రెడ్డి, మార్క ఉమా రఘుపతి గౌడ్, ఏకు రాజు, లక్కం శంకర్, పాలకుర్తి శ్రీనివాస్, మునిగంటి విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చవద్దు..




**చట్టం, సిరిసిల్ల :** పద్మశాలీలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, సిరిసిల్లను ఉరిసిల్లగా మార్చవద్దని ఆత్మహత్యల నివార ణ కమిటీ చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. ఆదివారం సిరిసిల్లలో ఇటీవల ఆత్మహత్యలు చేసుకున్న నేతకార్మిక కుటుంబాలను పరామర్శించారు. ఆత్మ హత్యల నివారణపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. పద్మశాలీ తన గుండెను కండెగా చేసి బట్టలు నేస్తూ ప్రపంచ మానవాళి తల ఎత్తుకుని తిరిగేలా చేస్తున్నారన్నారు. పద్మశాలీ చైతన్యవంతులై సామాజిక ఉద్యమాలకు నడుం బిగించాలన్నారు. ఆత్మహత్యల నివారణ కమిటీ ఆధ్వర్యంలో పద్మశాలీల ఆత్మహ త్యలపై సమగ్ర నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి సమర్పించి బాధితులకు న్యాయం చేసేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, పద్మశాలీ ప్రతినిధులు కొక్కుల భాస్కర్, పత్తిపాక సురేష్, రమేష్, జనార్ధన్, వీరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



**చట్టం, మోత్కూరు :** కార్మిక సంఘాల పిలుపు మేరకు మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం కోరారు. ఆదివారం మోత్కూరులో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మికుల పని గంటలను 8 నుంచి 12 వరకు పెంచిందని, 29కి పైగా ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి కొత్తగా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకవచ్చిందని విమర్శించారు. కార్మికుల ప్రయోజనాలు పట్టించుకోకుండా యాజమాన్యాల కొమ్ముకాస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా మే 20న నిర్వహించనున్న దేశ వ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు పాల్గొని విజయవంతంచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గొరిగే సోములు, మోత్కూరు మండల కన్వీనర్ సామ శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె.శ్రీను, కొంగరి మల్లమ్మ పాల్గొన్నారు.

## ఐఎన్‌టీయూసీకి ప్రాధాన్యతనివ్వడం సరికాదు

**చట్టం, యైుటింక్లయిన్‌కాలనీ :** సింగరేణి యాజమాన్యం కోడ్ ఆఫ్ డిసిప్లేన్‌ను ఉల్లంఘిస్తూ ఐఎన్‌టీయూసీకి ప్రాధాన్యతనివడం సరి కాదని ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్ తెలిపారు. ఆదివారం కాలనీలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ కార్మికుల మద్దతుగా గెలిచిందని, కానీ ఐఎన్‌టీయూసీ ప్రాతినిధ్య సంఘం హోదా దక్కని ఏరియాలో సైతం అధికా రులు వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. నైనీ బొగ్గు బ్లాక్‌లో ఉత్పత్తి ప్రారంభమైన సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం యాజమాన్యం 11 ఏరియాల్లో అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించిందని రవీందర్ పేర్కొన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌కు ఏఐటీయూసీ గెలిచిన ఆర్జీ1, 2 ఏరియాలతో పాటు బెల్లంపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల్లో ఐఎన్‌టీయూసీ నాయకులను ఆహ్వానించడం సరికాదన్నారు. సంస్థ ప్రతిష్ట పెరిగేలా ఇతర రాష్ట్రాల్లో బొగ్గు ఉత్పత్తి ప్రారంభమైన సందర్భాన్ని పురస్కరించుకుని అన్ని జాతీయ సంఘా లను ఆహ్వానిస్తే తాము సంతోషిచేవారమని, హోదాలేని యూనియన్‌ని ఆహ్వానించడం కోడ్ ఆఫ్ డిసిప్లేను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు.

# మొట్లపల్లి పాఠశాల వార్షిక మహోత్సవం

**చట్టం, భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి ప్రైమరీ స్కూల్లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వార్షికోత్సవంలో పిల్లల ఆట పాటలు, జానపద నృత్యాలు, దేశభక్తి నృత్యాలు, పాటలు, విద్య విషయక నాటికలు, ఏకపాత్రభినయాలు, వెస్ట్రన్ డ్యాన్స్ లు, ఆర్టిఫిషియల్ ఇంటల్ జెన్స్ పైన ఆంగ్ల ప్రసంగాలు, అధునిక విద్యావిధానం పైన ప్రసంగాలు ఇలా అనేక కార్యక్రమాలతో పాఠశాల ప్రాంగణం ఉర్రూతలూగిపోయింది. వర్ధమాన విషయాలపై పిల్లలు పాటలు, ఆంగ్ల ప్రసంగాలు, నాటికలు, డ్యాన్సులతో పాఠశాల ప్రాంగణం మారుమ్రోగిపోయింది. ఇందులో విద్యార్థుల తల్లిదండ్రులు, పురప్రముఖులు, విద్యాభిమానులు, పాఠశాల బాగు కోరే దాతలు శ్రేయేభిలాషులు, యువత, వృద్ధులు అనేక మంది ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి వచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అమ్మ ఆదర్శపాఠశాల కమిటీ చైర్మన్ ఆళ్ళ వనమాల , టెంపుల్ చైర్మన్ గుడూరి రఘుపతి రెడ్డి యాదవ సంఘం అధ్యక్షులు, డ్యాగ రమేష్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కలాస ప్రతాప్ ఎం,పీ, పీఎస్ తాడిచర్ల హెడ్మాస్టర్ బత్తుల సదానందం ఎంపీపీ ఎస్



రామారావు పల్లి ఎల్ ఎఫ్ హెడ్మాస్టర్ బండారి పద్మ ఎంపీపీ ఎస్ మెట్టుపల్లి హెడ్మాస్టర్ కొత్తూరి అంకూస్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అమ్మ ఆదర్మ పాఠశాల కమిటి చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ బడి అమ్మ ఒడి లాంటిది మన పాఠశాల ఉపాధ్యాయులు చాలా బాగా కష్టపడి పనిచేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం నిరంతరాయంగా శ్రమిస్తున్నారు మన పిల్లలను మన బడిలో చేర్పిద్దాం అంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా గుడూరి రఘుపతి రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల కృషిని, పాఠశాల ప్రగతిని అభినందిస్తూ, ఈ సంవత్సరం మన పాఠశాల నుంచి పది మంది పిల్లలు గురుకులు ప్రవేశ పోటీ పరీక్షలలో సీట్లు సాధించిన పిల్లలకు ఒక్కొక్కరికి 1,116రూ. చొప్పున ఆర్థిక సహాయాన్ని సభాముఖంగా ప్రకటించారు. డ్యాగ రమేష్ మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధిలో, పిల్లలను బడిలో చేర్పించడంలో, బడిలో జరిగే ఏ ఇతర కార్యక్రమాలకైనా నేను మీతో ఉంటాను కలిసి పనిచేద్దాం నేను మీకు సహాయ సహాకారాలను అందిస్తానని సభాముఖంగా హామి ఇచ్చారు పిల్లల కరతాల ధ్వనులతో కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బి. సదానందం, బి. పద్మ, కె. అంకూస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై మీరు నమ్మకం ఉంచండి, మీ పిల్లలను పంపించండి ప్రతి నెలలో చివరి శనివారం జరిగే పేరెంట్ టీచర్ మీటింగ్ రండి మీ పిల్లలు ఏ సబ్జెక్ట్ లో వెనుకబడి ఉంటున్నారో టీచర్లను అడగండి, ప్రభుత్వ బడి అమ్మ ఒడి లాంటిది మీరు పిల్లలను పంపించి టీచర్లకు బాధ్యతను ఇవ్వండి అప్పుడప్పుడు పాఠశాలను సంధర్శించి మీ పిల్లల విద్యావిషయాలపై చర్చించండి అంటూ మొట్లపల్లి గ్రామ ప్రజలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ తోటపల్లి మహేష్ వార్షిక నివేధిక చదివి వినిపిస్తున్నంత సేపు పిల్లలు వారి తల్లిదండ్రులు కరతాళ ధ్వనులతో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు డి, నాగేంద్ ఉయ్యాల సురేందర్, పి. శ్రీధర్, లత సునిత రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్



**చట్టం, పరకాల :** రైతు లేనిదే రాజ్యం లేదని రైతులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తూ సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నామని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆదివారం సంగెం మండల కేంద్రంలోని షాపూర్ మరియు సోమ్లా తండా గ్రామాల్లో ఎఫ్ ఎస్ సి ఎస్ కాపుల కనపర్తి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి తో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, కొనుగోలుకేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతు గర్వంగా బ్రతికేలా కృషి చేస్తున్నదని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు పండించిన పంటలు ప్రపంచ మార్కెట్ లో పోటీ పడి అమ్ముకొనేలా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రైతులకు ఆధునిక వ్యవసాయంపై శిక్షణ ఇచ్చే బాధ్యతలు రైతు సహకార సంఘాలకు ఇస్తున్నదని అన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఏ గ్రేడ్‌కు రూ. 2320, కామన్ రకానికి రూ.2300 ధర చెల్లిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17% మాయిచర్ ఉండాలి అని అన్నారు. నిబంధనల మేరకు తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని, లారీలలో మిల్లుల కు తరలించిన ధాన్యాన్ని అన్లోడ్ చేసే దగ్గర జాప్యం జరగకుండా చూడాలనీ సూచించారు. కేవలం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే సన్నధాన్యానికి బోనస్ లభిస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలికసదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రవాణ, హమాలీలు, గోనె సంచుల కొరత రాకుండా చూడాలని అన్నారు.

## వధూవరులను మాజీ మంత్రి ఆశీర్వాదం



**చట్టం, కామారెడ్డి ప్రతినిధి :** కామారెడ్డి సత్య కన్వెన్షన్ లో జరిగిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిషత్ మాజి చైర్మన్ లు దఫెదార్ రాజు, శోభ కూతురు వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే , జిల్లా అధ్యక్షులు ముజీబుద్దిన్ పాల్గొన్నారు. ఈ వివాహ వేడుకలో నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ ప్రారంభించిన షబ్బీర్అలీ



**చట్టం, కామారెడ్డి ప్రతినిధి:** నిజామాబాద్ పట్టణంలోని పులాంగ్ రోడ్ లో కురుమ సంఘ కమ్యూనిటీ హాల్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి కృషి చేసిన సభ్యులందరినీ అభినందిస్తూ వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం తరపున తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయి అన్నారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి తాహర్ బిన్ హంధాన్ గడుగు గంగాధర్ . నుడా చైర్మన్ కేశవ వేణు నరాల రత్నాకర్. తదితర నాయకులు పాల్గొన్నారు.

## కరపత్రం ఆవిష్కరణ



**చట్టం, ఇల్లంతకుంట :** మహనీయుల జయంతోత్సవ కరపత్రాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. మానకొండూర్ నియోజకవర్గ కార్యాలయం లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు సావనపెల్లి రాకేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు. మహనీయులు చూపిన మార్గంలో నడువాలని సూచించారు. మండలకేంద్రంలో ఈనెల 30న జరిగే కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే సూచించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జయంతోత్సవ కమిటీ కన్వీనర్ సావనపెల్లి రాకేష్, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, నాయకులు మామిడి సంజీవ్, కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పసుల వెంకటి, కాసుపాక శంకర్, ముత్యం అమర్, ఎలుక స్వామి, రామస్వామి, మంద రాజు, శంకర్, ఉస్మాన్, మామిడి రాజు, విజయ్, మచ్చ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల లొంగు'బాట'

**మొదటిపేజీ తరువాయి..**

దీంతో ఛత్తీస్‌గఢ్‌లో లొంగుబాటు సేఫ్ కాదని తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర వైపునకు తరలివస్తున్నట్లు అనుమానిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఒక్క భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే 203 మంది మావోయిస్టులు లొంగిపోయారు. గతేడాది ఈ సంఖ్య 36 మాత్రమే. గత మార్చి 15న ఒకేసారి 64 మంది లొంగిపోగా, ఏప్రిల్ 5న రికార్డు స్థాయిలో 86 మంది లొంగిపోయారు. ఈ నెల 12న ములుగులో 22 మంది లొంగిపోవడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది. మరోవైపు ఏపీలోని అల్లూరి జిల్లాలో ఈ నెల 5న 11 మంది లొంగిపోయారు.

**రూటు మార్చిన ఛత్తీస్‌గఢ్**

లొంగిపోయే మావోయిస్టుల కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఏప్రిల్ 10న కొత్త పథకం అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం లొంగిపోయిన మావోయిస్టులకు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని 120 రోజుల్లోగా అందిస్తామని పేర్కొంది. అదే విధంగా ప్రతీ మూడు నెలలకు ఒకసారి రూ.10 వేల వంతున స్టైఫండ్ అందించడం, గ్రామీణ ప్రాంతాల్లో అయితే వ్యవసాయ భూమి, పట్టణ ప్రాంతాల్లో అయితే ఇంటి స్థలాలు ఇస్తామని ప్రకటించింది.

## వేసవి సెలవుల్లోనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

**చట్టం, సిరిసిల్ల :** వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టడంతోపాటు పెండింగ్ బిల్లులు, డీఏలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలో టీపీటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం ఆదివారం జిల్లా అధ్యక్షుడు దుమాల రామనాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ యాజమాన్యాల ఆధ్వర్యంలో పలు రకాల పాఠ శాలలను నెలకొల్పి అంతరాలు కలిగిన విద్యావిధానాన్ని అమలు చేయడం ద్వారానే విద్యారంగంలో అసమానతలు ఏర్పడ్డాయన్నారు. వివిధ యాజమాన్యాల కింద కొనసాగుతున్న పాఠశాలలను రద్దు చేసి ప్రైవేటు పాఠశాలల వ్యవస్థను రద్దుచేసి విద్యార్థులందరికి నాణ్యమైన, శాస్త్రీయమైన సమానమైన విద్యను అందించాలంటే కామన్ స్కూల్ విధానాన్ని వెంటనే అమలుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 56 పాఠశాలలకే వేలకోట్లు నిధులు కేటాయించి వేలాది రూపా యల అభివృద్ధికి అరకొర నిఽధులు కేటాయించడం సరైందికాదన్నారు. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లాలో పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవుల ల్లోనే ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టడంతో పాటు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

# పంచాయతీ కార్యదర్శి సంతకాల ఫోర్జరీ

- **ఈ పంచాయతీ వెబ్సైటును దుర్వినియోగం చేసిన వారిపై చర్యలేవి?**
- **ఓ దస్తావేజులేఖరే ప్రధాన సూత్రధారి అని ఆరోపణలు?**
- **ఆర్టిఐతో నిజాలు వెలుగులోకి**
- **అవకతవకలపై ఏసీబీ అధికారుల ఆరా?**

**చట్టం, కామారెడ్డి ప్రతినిధి:** కామారెడ్డి జిల్లా బిక్కనూర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి అసెస్మెంట్ నెంబర్ వేసుకొని తద్వారా భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీని అంతటికీ కారణం దోమకొండ మండల కేంద్రంలోని దస్తావేజులేఖరే ప్రధాన సూత్రధారి అని ఆరోపణలు ఉన్నప్పటికీ ఆ సంబంధిత దస్తావేజులేఖరి తన పలుకుబడిని ఉపయోగించి అధికారులను తప్పుదోవ పట్టించి ఎవరు ఏమి చేయలేరు అన్న ధీమాతో ఇప్పటికీ పంచాయతీ వెబ్సైట్ను అనధికారికంగా వాడుకుంటున్నట్లు సమాచారం. అయినప్పటికీ అధికారులు మాత్రం పూర్తిస్థాయి విచారణ చేయడంలో విఫలమవుతున్నారు. గతంలో రాజంపేట గ్రామంలో ముగ్గురు కుటుంబ సభ్యులకు సంబంధించిన భూమిని వారికి తెలియకుండా వారి కుటుంబ సభ్యులకు చెందిన ఒకరి పేరు పైనే అసెస్మెంట్ నెంబర్ వేసి ఆక్రమంగా పంచాయతీ వెబ్సైట్లోకి ప్రవేశించి అందులో ఆ నెంబర్ను వేయడంతో సంబంధిత రిజిస్టర్ అతని


1/4

గ్రామ పంచాయతీ కార్యాలయము :: భిక్కనూర్
మండలము :: భిక్కనూర్ జిల్లా :: కామారెడ్డి

పంచాయతి కార్యదర్శి,
గ్రా. పం. భిక్కనూరు నుండి.

శ్రీ.ముద్రకోల సర్వంలు,
గబ్బానాయక్ తాండా
మాచారెడ్డి మండలం గారికి.

లేఖ నెం.జి.పి.బి /RTI/23/2025, తేది: 15/02/2025

విషయము:- సమాచార హక్కు చట్టము – 2005 ప్రకారం మీరు అడిగిన సమాచారమునకు సమాధానం సమర్పించుట - గురించి.

సందర్భము:- తమరి దరఖాస్తు, తేది:20.01.2025 .

*****

పై విషయ, సందర్భానుసారము తమరికి తెలియజేయునది ఏమనగా గ్రామ పంచాయతి భిక్కనూర్ నందు మీరు అడిగినటువంటి సమాచారము సబ్ రిజిస్ట్రార్ కార్యాలయము, దోమకొండ నందు డాక్యుమెంట్ నెం.311/2024, 312/2024 గల డాక్యుమెంట్లకు మా గ్రామ పంచాయతి నుండి ఏలాంటి ధృవీకరణ పత్రముగాని, అసెస్ మెంటు నంబర్ గాని ఇవ్వలేదని మీకు తెలియజేయుచున్నాము.

పంచాయతి కార్యదర్శి
గ్రా.పం. భిక్కనూర్.

పేరు పైన భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. సదరు కుటుంబ సభ్యులు గొడవ చేయడంతో అధికారులు కలగజేసుకొని వారి మధ్య రాజి కుదుర్తమని ప్రయత్నించడంతో ఆ ప్రయత్నం విఫలమైంది దీంతో సంబంధిత బాధ్యులు కోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు అని సమాచారం. ఇటీవల బిక్కనూర్ గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ కార్యదర్శికి సమాచారం లేకుండా రెండు అసెస్మెంట్ నెంబర్లు పంచాయతీ సంతకం ఫోర్జరీ చేసి, ఇంటి నెంబర్,


Panchayat Raj & Rural Employment
Government of Telangana

House Tax Assessment Details

| | | | |
|---|---|---|---|
| Assessment No | 883 | Owner | Bogari Nidarkar Hamsaha Rao |
| House No | 3-89/2/A | Father/Husband Name | Bogari Nidarkar Nagappa |
| Building Usage | Residential | Exemption | Not Exempted |
| Dt. of Asmt. | [illegible] | Status | Current Demand not Paid |
| Court Case | No | Building Classification | Roof with AC Sheets/Tin Sheets |

Current Demand Details

| Period From | Period To | House Tax | Library Cess | Drainage Tax | Water Tax | Lighting Tax | Total Amount(Rs) |
|---|---|---|---|---|---|---|---|
| 01/04/2023 | 31/03/2024 | 274 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | 377 |

Arrear Details

| Period From | Period To | House Tax | Library Cess | Drainage Tax | Water Tax | Lighting Tax | Total Amount(Rs) |
|---|---|---|---|---|---|---|---|

No Arrear Records Found

Total HouseTax Amount to Pay

| | |
|---|---|
| Current Demand Total | 377.0 |
| Arrear Total | 0 |
| Total | 377.0 |

Make Payment

Note: If your amount debited from bank account and payment not completed then it will update in 24 Hours.

Collection Details

| Period | Book No./Receipt No. | Dt. of Collection | Arrear Total | Current Total | Total Amount(Rs) |
|---|---|---|---|---|---|

No Collection Records Found

Back

3 89/2/A, అసెస్మెంట్ నెంబర్,883, సృష్టించి అక్రమంగా ఈ పంచాయతీ వెబ్సైట్లోకి ప్రవేశించి డాక్యుమెంట్ నెంబర్ 312/2024, లో497.77 గజాల స్థలాన్ని తేదీ 22 జనవరి 2024న రిజిస్ట్రేషన్ చేశారు. దీంతోపాటు అదే సమయంలో అసెస్మెంట్ నెంబర్ దానిని పెట్టి డాక్యుమెంట్ నెంబర్ 311/2024, 470.30గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారు. ఒక అసెస్మెంట్ నెంబర్ పై ఒకేసారి రిజిస్ట్రేషన్ చేయవలసి ఉండగా సంబంధిత రిజిస్టర్ మాత్రం ఒక అసెస్మెంట్ నెంబర్తో, ఒకే ఇంటి నెంబర్ పై రెండు సార్లు రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయంపై సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శి వివరణ కోరగా తాము అట్టి అసెస్మెంట్ నెంబర్లను జారీ చేయలేదన్నారు. ఈ విషయంపై సంబంధిత రిజిస్టర్ ను వివరణ కోరగా ఈ పంచాయతీ వెబ్సైట్లో ఆ నెంబరు ఉండడంతోనే తాను రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. వీటి అన్నిటిని ఆధారంగా చేసుకుని జిల్లా పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు.

**కోట్లకు పడగలెత్తిన ఆ దస్తావేజులేకరి..**

ఆ దస్తావేజులేఖరీ సామాన్య స్థాయి నుండి కోట్లకు పడగలెత్తడంతో పలువురు ఆ దస్తావేజులేఖరిపై దృష్టి పెట్టగా పలు ఆసక్తికర విషయాలు బయటకు వచ్చాయి. రాజంపేట, భిక్కనూర్ లతోపాటు ఇటీవల వెలుగు చూసినా దోమకొండ గ్రామంలో జరిగిన తప్పుడు అసెస్మెంట్ నెంబర్ రిజిస్ట్రేషన్ ప్రధాన సూత్రధారి ఆ దస్తావేజులేఖరి అని ఆ చుట్టుపక్కల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి సరియైన విచారణ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సబ్ రిజిస్టర్ పరిధిలోని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయాలపై పత్రికల్లో ప్రచురితం కాగా ఏసీబీ అధికారులు దోమకొండ సబ్ రిజిస్టర్ కార్యాలయం పరిధిలో జరుగుతున్న అవకతవకలపై దృష్టి సారించి అధికారుల నుండి సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలిసింది.

Printed, Published and Owned by SIRIGADA PRASAD and Printed at INDUR OFFSET PRINTERS, Opposite Cheer Hanuman Temple, Weekly Bazar, Nizamabad District,Telangana 503001., and Published at: H.No. 3-3-486/2, Gayathrinagar, Varni road, Nizamabad District, Telangana – 503001.,Editor: SIRIGADA PRASAD. RNI.No. TELTEL/2010/32350. Cell ;9948884497. prasadsirigada27@gmail.com